విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :59 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | బుధవారం 22 జూలై 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



## పాక్ విక్టిమ్ కార్డ్ వ్యూహం విఫలం

- యథావిధిగా సింధు జలాల ఒప్పందం పునరుద్ధరణ సాధ్యం కాదు: భారత్
- పాక్ ఉగ్రవాదానికి స్వస్తి పలకాల్సిందే
- అప్పటి వరకు సింధు జలాల ఒప్పందం నిలిపివేస్తాం
- మరోసారి స్పష్టం చేసిన భారత్

# గ్లోబల్ మార్కెట్ వైపు అడుగులు

- ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు
- దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో కుదుర్చుకున్న మరో ఒప్పందం సాకారం
- ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్
- సీఎం చంద్రబాబుతో యూఏఈ మంత్రి భేటీ



అమరావతి

ఏపీ పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు ఇప్పుడు గ్లోబల్ మార్కెట్ వైపు అడుగులు వేస్తున్నాయి. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన వేదికగా జరిగిన అంతర్జాతీయ చర్చలు ఇప్పుడు రాష్ట్రంలో పెట్టుబడులుగా మారుతున్నాయి. రాష్ట్రాన్ని అంతర్జాతీయ ఆహార శుద్ధి హబ్‌గా మార్చే దిశగా ప్రతిష్టాత్మకమైన యూఏఈ ఫుడ్ క్లస్టర్ ప్రాజెక్ట్ రాష్ట్రంలో సాకారమవుతోంది. దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో కుదుర్చుకున్న మరో ప్రతిష్టాత్మక ఒప్పందం సాకారమైంది. ఆంధ్రప్రదేశ్?లో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సచివాలయంలో

వివరాలు 2లో..



2019లో ప్రభుత్వం కొనసాగి ఉంటే

## 2021 నాటికి పోలవరం పూర్తయ్యేది

- జలవనరుల శాఖపై సచివాలయంలో మంత్రి నిమ్మల శ్వేతపత్రం విడుదల
- ముఖ్యమైన ప్రాజెక్టులు స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- 2028కి 36 ప్రధాన ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటన

2లో

## విద్యార్థుల ఆవేదనను గౌరవించాలి



- ప్రభుత్వానికి కేంద్రమంత్రి సూచన
- విద్యార్థుల గొంతును అణచివేయడాన్ని సమర్థించను
- శాంతియుత నిరసనలు ప్రతి ఒక్కరి హక్కని వ్యాఖ్య
- సమస్యల పరిష్కారానికి చర్చలే ఉత్తమ మార్గమని హితవు
- ప్రభుత్వం ఎప్పుడూ చర్చలకు సిద్ధంగా ఉంటుందని వెల్లడి
- నిరసనలు హద్దులు దాటొద్దు


## బ్రిటన్‌లో నూతన శకం

- తొలి ఏపీ మంత్రిగా కనిష్క నారాయణ్
- నూతన ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ కేబినెట్లో ఇద్దరు భారత సంతతికి చోటు
- కనిష్క నారాయణ్‌తో పాటు లీసా నాండీకి మంత్రివర్గంలో చోటు



# ఢిల్లీలో ఉద్రిక్తత

- ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా..
- రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నీట్ వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసన
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుబట్టడంతో విఫలమైన చర్చలు
- అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్



### మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలి

- విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి
- ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ ధర్నా
- మోదీ ఇంటి ముందు రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ధర్నా
- విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జీకి బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేయాలని డిమాండ్

# విద్యార్థుల వెంటే ప్రభుత్వం

- నీట్ పేపర్ లీక్ దోషులపై కఠిన చర్యలు
- ప్రశ్నాపత్రాల లీకేజీ దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించే అంశం
- మంగళ్ మిలన్' పేరుతో ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ భేటీ
- నీట్ పేపర్ లీక్ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలని ప్రధాని సూచన





## ఉపరాష్ట్రపతితో రాష్ట్ర మంత్రుల భేటీ

న్యూఢిల్లీ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పలువురి కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగానే కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం అభివృద్ధి, రైతుల సంక్షేమం, పంటలకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు, మార్కెటింగ్ సదుపాయాల బలోపేతం, రైతుల ఆదాయాన్ని పెంచే చర్యలు గురించి చర్చించారు.

# సాంకేతిక పోలీసింగ్‌తో దేశానికే ఏపీ ఆదర్శం

- నేరం ఆధునికమైతే.. పోలీస్ అంతకంటే ఆధునికం కావాలి
- ఫ్యూచర్--రెడీ ఏపీ పోలీస్ రిట్రీట్‌లో హోం మంత్రి అనిత
- అత్యాధునిక పోలీసింగ్ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యం: డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా



అమరావతి

నేరాల స్వరూపం రోజురోజుకు సాంకేతికత ఆధారంగా మారుతున్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ పోలీసింగ్ కూడా అంతకంటే ఆధునికంగా, వేగవంతంగా, ప్రజాకేంద్రీకతంగా రూపాంతరం చెందాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలోని డా. బిఆర్ అంబేద్కర్ కళా వేదిక లో నిర్వహించిన రిట్రీట్‌లో హోం మంత్రి అనిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు . రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఉన్నత పోలీసు అధికారులను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. 2001లో అప్పటి ముఖ్యమంత్రి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన పోలీసు సంస్కరణల రిట్రీట్ సంప్రదాయాన్ని 25 సంవత్సరాల అనంతరం అదే దూరదష్టి, అదే సంస్కరణల స్ఫూర్తితో పునరుద్ధరించడం చారిత్రాత్మకమని హోంమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్ సవాళ్లను ముందుగానే అంచనా వేసి పోలీసు వ్యవస్థను సిద్ధం చేయడమే ఈ రిట్రీట్ ప్రధాన లక్ష్యమని వివరించారు. రాష్ట్రంలో ఫ్యాక్షన్‌రాజకీయాలు, వామపక్ష తీవ్రవాదం, మతకలహాలను గణనీయంగా అదుపులోకి తీసుకురాగలిగామని పేర్కొన్న హోంమంత్రి, ప్రస్తుతం సైబర్ నేరాలు, రౌడీయిజం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆధునిక నేరాలను ఎదుర్కోవడానికి పోలీసులు కూడా అత్యాధునిక సాంకేతిక

వివరాలు 2లో..

# సిదిరిని భయపెడుతున్న కేసులు

**శ్రీకాకుళం :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో శ్రీకాకుళం జిల్లా మరోసారి చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన కీలక నాయకుల చుట్టూ వరుసగా వివాదాలు నెలకొంటుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే జిల్లాలో పలువురు ప్రముఖ నేతలు వివిధ కారణాలతో వార్తల్లో నిలిచిన నేపథ్యంలో, ఇప్పుడు మాజీ మంత్రి సీదరి అప్పలరాజు పేరు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆయనపై నమోదైన కేసు, అరెస్టు జరిగే అవకాశాలపై జరుగుతున్న ప్రచారం జిల్లాలో రాజకీయ చర్చలకు దారితీస్తోంది.గతంలో పార్టీ తరఫున దూకుడుగా స్పందిస్తూ అధికార పక్షంపై విమర్శలు చేసిన నాయకుల్లో సీదరి అప్పలరాజు ఒకరు. జిల్లాలో పార్టీ తరఫున బలమైన స్వరం వినిపించే నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. అయితే ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం వ్యవహారం ఆయనను ఇబ్బందుల్లోకి నెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో ఆయన కుమారుడు ఆరవ్ వర్మ పేరు ప్రధానంగా వినిపిస్తోంది.పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, వేగంగా బైక్ నడపడం వల్ల జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన అనంతరం ఆరవ్ వర్మను పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆయనను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు సమాచారం. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో మాజీ మంత్రి పాత్రపై కూడా పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.దర్యాప్తులో భాగంగా ప్రమాదానికి సంబంధించిన ఆధారాలను ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందనే అనుమానాలపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మాజీ మంత్రిపై కూడా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు ప్రచారం సాగుతోంది. భారతీయ న్యాయ సంహిత లోని 61(2), 238, 240, 242, 249, 49 సెక్షన్ల కింద కేసు



నమోదు చేసినట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ కేసు ఆధారంగా తదుపరి చర్యలు ఏముంటాయన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.మాజీ మంత్రి అరెస్టు జరిగే అవకాశముందంటూ పలాస ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటివరకు పోలీసులు అధికారికంగా అలాంటి ప్రకటన చేయలేదు. మరోవైపు సీదరి అప్పలరాజు కూడా ఈ ఘటనపై బహిరంగంగా స్పందించలేదు. ఆయన మౌనం కూడా ఈ వ్యవహారంపై మరిన్ని చర్చలకు కారణమవుతోంది.సమాచారం ప్రకారం, ప్రస్తుతం ఆయన న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కేసు పురోగతిని దృష్టిలో పెట్టుకుని తదుపరి న్యాయపరమైన చర్యలపై చర్చిస్తున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అదే సమయంలో పోలీసు అధికారులు కూడా ఈ కేసును అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నట్లు సమాచారం. శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు వివిధ కారణాలతో వార్తల్లో నిలిచిన పరిస్థితుల్లో, ఇప్పుడు మాజీ మంత్రి చుట్టూ నెలకొన్న ఈ పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# లోకల్ బాడీ ఎన్నికల్లో జనసేన లొల్లి

**గుంటూరు :** స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పోటీపై ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు కూటమిలో అగ్గి రాజేస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జనసేన, టీడీపీ నేతల మధ్య సీట్ల పంచాయతీకి దారితీసే అవకాశం ఉంది. అయితే టీడీపీ క్యాడర్ స్పందించి ఎలాంటి ప్రకటనలు చేయకుండా పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు ముందుగానే స్పందించి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.రాబోయే ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిలోని ఏ పార్టీ ఎన్నెన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనే అంశంపై టీడీపీ నాయకులెవరూ బహిరంగంగా మాట్లాడవద్దని పార్టీ అధినేతల చంద్రబాబు క్యాడర్‌ను ఆదేశించారు. పార్టీ ముఖ్య నేతలతో చంద్రబాబు శనివారం రాత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, అనవసర చర్చలకు అవకాశం ఇచ్చేలా ఏ ఒక్కరూ వ్యవహరించవద్దని హెచ్చరించారు. కూటమి భాగస్వామ్య పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య విభేదాలు సృష్టించడానికి గొడ్డలి పార్టీ వైసీపీ కాచుకుని కూర్చుందని, ఈ విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలని సూచించారు. ఎన్నికల కార్యాచరణను మరింత బలోపేతం చేసేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో వచ్చే నెల మొదటి లేదా రెండో వారంలో ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహిస్తామని చంద్రబాబు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల సీట్ల సర్దుబాటు గురించి టీడీపీ నేతలు చర్చించవద్దని, పోటీ చేసే స్థానాలపై ఎలాంటి ప్రకటనలు చేయవద్దని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆ అంశాన్ని కూటమి పార్టీల అగ్రనాయకత్వం సరైన సమయంలో చర్చించి నిర్ణయం తీసుకుంటుందన్నారు. పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధం చేయడంపైనే ఫోకస్ చేయాలని సూచించారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి అద్భుత ఫలితాలు సాధించేలా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.ఏపీలో స్థానిక



సంస్థల ఎన్నికలపై జనసేన నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల గుంటూరులో కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో జనసేనకు బలం ఉన్న ప్రతి చోటా తాము తప్పకుండా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసం, వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశంతో అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసైనికులు వెనక్కి తగ్గారని గుర్తుచేశారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని, క్షేత్రస్థాయిలో బలాబలాలు చూసుకుని సర్పంచ్ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీకి జన సైనికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఆనాటి సార్వత్రిక ఎన్నికల ఫార్ములా స్థానిక ఎన్నికలకు వర్తించదని, ఈసారి సీట్ల విషయంలో తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పార్టీ కోసం మొదటి నుండి కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు పోటీ చేసేందుకు జనసేనలో తగిన ప్రాధాన్యత, అవకాశాలు కల్పిస్తామన్నారు. కూటమిలోని మిత్రపక్షాలతో తగిన సమన్వయం చేసుకుంటూనే, జనసేన శ్రేణులంతా ఎన్నికలకు సంపూర్ణంగా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రకటనతో కూటమిలో సీట్ల సర్దుబాటుపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

# స్వర్ణగ్రామాలుగా మార్పు

**ఒంగోలు :** ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ, వార్డు స్థాయిలో ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థకు ఇప్పుడు కొత్త గుర్తింపు తీసుకురావాలని కూటమి ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇప్పటికే ఈ కార్యాలయాల పేర్లను మార్చిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ మార్పు ప్రజల్లో స్పష్టంగా కనిపించేలా రాష్ట్రవ్యాప్తంగా కొత్త నేమ్‌బోర్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీంతో ఇకపై "సచివాలయం" అనే పేరుకు బదులుగా "స్వర్ణ గ్రామం" "స్వర్ణ వార్డు" పేర్లు అధికారికంగా మరింత ప్రాధాన్యం పొందనున్నాయి.గ్రామ, వార్డు సచివాలయాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 2019 అక్టోబర్ 2న ప్రారంభించింది. ఆ తర్వాత ఈ వ్యవస్థ ద్వారా పలు ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. అయితే 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థపై సమగ్రంగా అధ్యయనం చేసిన అనంతరం పేర్లలో మార్పు తీసుకొచ్చింది. అధికారిక రికార్డుల్లో కొత్త పేర్లు అమల్లోకి వచ్చినప్పటికీ, ప్రజల్లో మాత్రం ఇప్పటికీ చాలా మంది వాటిని సచివాలయాలుగానే పిలుస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం కొత్త చర్యలకు శ్రీకారం చుట్టిందిరాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 15 వేలకుపైగా కార్యాలయాల వద్ద ఒకే నమూనాలో కొత్త నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తాజాగా



ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బోర్డుల రూపకల్పన, పరిమాణం, నాణ్యత విషయంలో కూడా స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఆరు మిల్లీమీటర్ల అక్రిలిక్ షీట్‌తో పాటు 3్8 అడుగుల ఏసీపీ ( బోర్డులను తయారు చేయాలని నిర్ణయించింది. ఈ బోర్డుల తయారీ, సరఫరా బాధ్యతలను గుంటూరు జిల్లా తాడేపల్లి లోని నెక్స్టోరా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు టెండర్ ప్రక్రియ ద్వారా అప్పగించింది.బోర్డుల తయారీ పూర్తయ్యే కొద్దీ వాటిని వేగంగా సంబంధిత కార్యాలయాలకు చేరవేసి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాలని సూచించింది. అలాగే మండల పరిషత్ అభివృద్ధి అధికారులు , మున్సిపల్ కమిషనర్లు (, సంబంధిత శాఖల అధికారులు బోర్డులను స్వీకరించి ప్రతి కార్యాలయం వద్ద సక్రమంగా అమర్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. బోర్డులు ఎలాంటి నష్టం లేకుండా అందాయని నిర్ధారించిన తర్వాత అధికారుల సంతకం, కార్యాలయ ముద్రతో వాటిని నమోదు చేయాలని కూడా స్పష్టం చేసింది. అంతేకాకుండా బోర్డుల వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసి, జిల్లా కోఆర్డినేటర్లు మొత్తం ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది.రాజకీయంగా కూడా ఈ నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. గతంలో సచివాలయ భవనాల రంగులు ఒక రాజకీయ పార్టీని గుర్తు చేసేలా ఉన్నాయని విమర్శలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భవనాలకు రాజకీయ పార్టీలను ప్రతిబింబించే రంగులు ఉండకూడదనే విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇప్పుడు కొత్త పేర్లతో పెద్ద నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల్లో కొత్త గుర్తింపును బలపరచాలని భావిస్తోంది. మరోవైపు, ఈ వ్యవస్థను ప్రారంభించింది తమ ప్రభుత్వమే కాబట్టి పేర్లు మారినా ప్రజలు దాని ఆరంభాన్ని గుర్తుంచుకుంటారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ అంశం పరిపాలనతో పాటు రాజకీయ చర్చలకు కూడా కేంద్రబిందువుగా మారింది.

## గ్లోబల్ మార్కెట్ వైపు అడుగులు

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ప్రత్యేకంగా భేటీ అయింది. ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుపై సీఎంతో యుఏఈ ప్రతినిధుల బృందం చర్చించారు.

నేరుగా అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి: ఈ ఏడాది సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన సందర్భంగా ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేసింది. తాజాగా జరిగిన చర్చలతో ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చాయి. ఆహార శుద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్) రంగంలో రాష్ట్రవ్యాప్తంగా బలమైన వాల్యూ చైన్ ఏర్పాటు చేయాలని యూఏఈ నిర్ణయించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య అధికారిక భాగస్వామ్యం కుదిరింది. రాష్ట్రంలో విస్తారంగా పండే మామిడి, అరటి, కోకో సహా వివిధ రకాల నాణ్యమైన ఉద్యానవన పంటలను గల్ఫ్ దేశాలతో పాటు అంతర్జాతీయ మార్కెట్లకు నేరుగా ఎగుమతి చేసేలా ఈ వ్యాల్యూ చైన్‌ను నిర్మిస్తారు.

దీనివల్ల అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడమే కాకుండా, స్థానిక రైతులకు అంతర్జాతీయ స్థాయిలో గిట్టుబాటు ధర లభిస్తుంది. అలాగే ఆహార శుద్ధి రంగంలో రాష్ట్ర యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో యూఏఈ దేశ ప్రతినిధులతో పాటు ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల విభాగం, ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఈడీబీ) ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఒప్పందం రాష్ట్ర వ్యవసాయ, పారిశ్రామిక రంగానికి కొత్త ఊపును ఇస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

## 2019లో ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికి పోలవరం పూర్తయ్యేది

గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి రూ.24,611 కోట్లు ఖర్చు చేయగా అందులో రూ.12,484 కోట్లు రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేశామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. 36 ప్రధాన ప్రాజెక్టులను రూ.35,555 కోట్లతో 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను మంత్రి వివరించారు. తెలుగుదేశం పార్టీకి ముందు తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత అన్నట్లుగా రాష్ట్ర ఇరిగేషన్ రంగాన్ని చూడాలని మంత్రి అన్నారు. విధ్వంసమైన జలవనరుల రంగాన్ని రెండేళ్లలో గాడిలో పెట్టి ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకటించుకుని ముందుకెళ్తున్నామని మంత్రి నిమ్మల తెలిపారు. 2019లో ప్రభుత్వం కొనసాగి ఉంటే పోలవరం 2021కల్లా పూర్తయ్యేదని గుర్తు చేశారు. జగన్ ఒక్క చాన్స్ అంటూ వచ్చి దయాఫ్రమ్ వాల్ ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. గత 2 ఏళ్లలో రూ.1050 కోట్లు ఖర్చు చేసి జులై 2026 నాటికి పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీటి సరఫరా లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వివరించారు.

పూర్తికాని వెలుగొండను జాతికి అంకితం చేసిన ఘనత జగన్?కే దక్కుతుందని మంత్రి నిమ్మల ఎద్దేవా చేశారు. ఐదేళ్లలో గొడ్డకి పార్టీ రూ.981 కోట్లు వెలుగొండకు వెచ్చిస్తే గత రెండేళ్లలో రూ.1108.12 కోట్లు ఖర్చు చేశామని స్పష్టం చేశారు. రూ.3,870 కోట్లతో హంద్రీనీవా 2 దశల పనులు 100 రోజుల్లో పూర్తి చేశామని వెల్లడించారు. జలవనరుల శాఖపై సచివాలయంలో మంత్రి శ్వేతపత్రం విడుదల చేశారు. ముఖ్యమైన ప్రాజెక్టులు 2024నాటి పరిస్థితులు తాజా స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

"ఐదేళ్ల వైఎస్సార్సీపీ విధ్వంస పాలనతో చాలా నష్టపోయాం. ఇప్పుడిప్పుడే అన్ని వ్యవస్థలు మళ్లీ దారిలోకి వస్తున్నాయి. 2014-2019 మధ్య పోలవరం ప్రాజెక్టు పనులు ముమ్మరంగా సాగాయి. పోలవరం ప్రాజెక్టు 72 శాతం పనులు పూర్తి చేశాం. మరో ఐదేళు పాలన కొనసాగి ఉంటే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేది. ఒక్క ఛాన్స్ అంటూ వచ్చిన జగన్ విధ్వంసంతో పాలన మొదలుపెట్టారు." -నిమ్మల రామానాయుడు, జలవనరుల శాఖ మంత్రి

ఎవరెంత హెచ్చరించినా ఖాతరు చేయలేదు: పోలవరం ప్రాజెక్టుకు భూములిచ్చిన నిర్వాసితులు మోసానికి గురయ్యారని పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గొడ్డలి పార్టీ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా పోలవరం ప్రాజెక్టుకు, నిర్వాసితులకు కూడా ఖర్చు పెట్టకుండా దారి మళ్లించారని ఆరోపించారు. నిర్వాసితులను ఏనాడు పట్టించుకోని వైఎస్సార్సీపీకి ప్రాజెక్టుపై మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు.

ఏజెన్సీలు, కాంట్రాక్టులు రద్దు చేయవద్దని చెప్పినా గత ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఎవరెంత హెచ్చరించినా గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఖాతరు చేయలేదని మంత్రి నిమ్మల అన్నారు. 17 నెలల పాటు ఏజెన్సీ, అధికారులు లేకుండా రివర్స్ టెండరింగ్ పేరుతో గత ప్రభుత్వం తప్పిదం చేసిందని 2020లో వచ్చిన వరదలకు డయాఫ్రంవాల్ దెబ్బతిందని నిపుణులు చెప్పారని తెలిపారు. 17 నెలలపాటు కాలయాపన చేయడమే తప్పిదమని నాడు చెప్పారని ఇంకా ఇది ప్రకృతి తప్పిదం కాదని మానవ తప్పిదమని నాటి ప్రభుత్వానికి నిపుణులు రిపోర్టు ఇచ్చారని వెల్లడించారు.

## సాంకేతిక పోలీసింగ్‌తో దేశానికే ఏపీ ఆదర్శం

-మొదటిపేజీ తరువాయి

పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 112 అత్యవసర స్పందన వ్యవస్థ ద్వారా స్పందన సమయాన్ని గణనీయంగా తగ్గించామని, పోలీసింగ్‌లో 'గోల్డెన్ టైమ్' అత్యంత కీలకమని హోంమంత్రి పేర్కొన్నారు. వేగవంతమైన స్పందన వల్ల నేరస్థులను త్వరగా అదుపులోకి తీసుకురావడంతో పాటు బాధితుల్లో భరోసా పెరుగుతుందని అన్నారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ.. రాబోయే 20 సంవత్సరాల సవాళ్లను ఎదుర్కొనే అత్యాధునిక పోలీసింగ్ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమన్నారు. మారుతున్న నేరాల స్వరూపాన్ని దష్టిలో పెట్టుకుని 10 కీలక అంశాలతో కూడిన భవిష్యత్ కార్యాచరణను రూపొందించినట్లు వెల్లడించారు. సాంప్రదాయ పోలీసింగ్‌కు బదులుగా డిజిటల్, టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాల సాధన కోసం 0--3 సంవత్సరాలు (స్వల్పకాలిక), 3--7 సంవత్సరాలు (మధ్యకాలిక), 7--20 సంవత్సరాలు (దీర్ఘకాలిక) దశలవారీ కార్యాచరణ ప్రణాళికతో ఏపీ పోలీస్ శాఖ ముందుకు సాగుతుందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు.

## క్రెడిట్ కోసం కమలం...



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ బలోపేతం కావడానికి ప్రయత్నాలు ఎన్నికలకు మూడేళ్ల ముందు ప్రారంభించినట్లు కనిపిస్తుంది. ఇప్పటి వరకూ కొంత ఆలోచన చేస్తూ.. తన పార్టీ కార్యక్రమాలకే పరిమితమవుతున్న నేతలు ఇకపై రాష్ట్రాభివృద్ధిలో తమ పాత్రపైనా జనంలో చైతన్యం తెచ్చేందుకు అవసరమైన చర్యలు ప్రారంభించిందని అనుకోవాల్సి ఉంటుంది. అందుకే ఇటీవల బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ నేతృత్వంలో పోలవరం పర్యటనకు బయలుదేరి వెళ్లారరు. పోలవరం ప్రాజెక్టు పూర్తవుతున్న దశలో జాతీయ ప్రాజెక్టుకు నిధులు ఇచ్చింది కేంద్రలో అధికారంలో ఉన్న బీజేపీ అన్న విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. అందుకే తాజాగా జరిగిన పార్టీ సమావేశంలోనూ బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ కీలక వ్యాఖ్యలు రాజకీయంగా హాట్ టాపిక్ అయ్యాయి. పోలవరంపై క్రెడిట్ తీసుకోవడంలో విఫలమయ్యామని మాధవ్ అన్నారు. అమరావతికి నిధులు, సీమకు ప్రాజెక్టులు ఇచ్చినా చెప్పుకోలేకపోయామని అనడం వారు ఇకపై కేంద్ర నిధుల ప్రస్తావన పదే పదే ప్రచారం చేస్తూ పార్టీ బలోపేతానికి ప్రయత్నం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ప్రజల ముందు తలెత్తుకుని చెప్పుకోవాల్సిన నేతలు, ఇన్నాళ్లూ మౌనంగా ఉండటం వల్ల నష్టపోయామని బీజేపీ రాష్ట్ర నేతలు గుర్తించారు. కూటమిలో ఉంటూనే రాష్ట్రాభివృద్ధిలో తమ పాత్రను తెలియ చేయాలని నిర్ణయించారు. ఎన్నికల్లో పోటీ చేయాలంటే గెలిచే శక్తి ఉండాలి . సీట్లు అడగడం ముఖ్యం కాదు గెలవగలమన్న నమ్మకం పార్టీ నాయకత్వానికి కల్పించాలి. పార్టీకి ఇప్పుడే మళ్లీ మంచి వాతావరణం ఉందని, మరో స్టెప్ ఎక్కాలని భావిస్తున్నారు. కూటమిలో కార్యకర్తలకు అన్యాయం జరిగితే పార్టీ అండగా ఉంటుందని బీజేపీ నేతలు భావిస్తున్నారు. అలాగే ఇకపై యాచించడం అంటూ ఏమీ ఉండకుండా శాసించే స్థాయికి ఎదగాలని, మనకు అవతలి వారి అవసరం ఎంత ఉందో.. దానికి రెట్టింపు అవసరం మనతో వారికీ ఉందని బీజేపీ నేతలు నేటికీ గుర్తించి ఇక కార్యాచరణకు సిద్ధమయ్యారు. అందుకే ఇక వరస సమావేశాలు నిర్వహించడమే కాకుండా కేంద్ర నాయకులను కూడా రాష్ట్రానికి రప్పించి పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని పార్టీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

# విభిన్న ప్రతిభావంతులకు త్రీ వీలర్ మోటార్ సైకిళ్లను అందజేసిన మంత్రి.





- విభిన్న ప్రతిభావంతుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కూటమి ప్రభుత్వం.
- విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

**ధర్మవరం, పెన్ సత్తా, జూలై 21:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వారి జీవనోపాధి, స్వయం ఉపాధి, విద్య, ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగుపడేలా పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మంగళవారం ధర్మవరం ఎన్డీఏ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గానికి చెందిన 10 మంది విభిన్న ప్రతిభావంతులకు రెట్రో-ఫిట్టెడ్ త్రీ వీలర్ మోటార్ సైకిళ్లను మంత్రి సత్యకుమార్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంగ వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులు స్వతంత్రంగా ప్రయాణించేందుకు, ఉద్యోగాలు, విద్య, స్వయం ఉపాధి అవకాశాలను సులభంగా పొందేందుకు ఈ ప్రత్యేకంగా రూపకల్పన చేసిన రెట్రో-ఫిట్టెడ్ త్రీ వీలర్ మోటార్ సైకిళ్లు అందజేస్తోందని తెలిపారు. దాదాపు రూ.1,25,000 విలువ చేసే ఒక్కో ప్రత్యేక వాహనం లబ్ధిదారులు సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు ప్రత్యేకంగా రూపొందించబడిందని చెప్పారు. ఈ వాహనాల ద్వారా దివ్యాంగులు తమ దైనందిన జీవితంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడమే కాకుండా, సమాజంలో మరింత గౌరవప్రద మైన జీవితం ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతతో అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రం లోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 10 వాహనాలు చొప్పున, రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,750 రెట్రో-ఫిట్టెడ్ త్రీ వీలర్ మోటార్ సైకిళ్లను అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు గడిపే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఈ వాహనాలు లబ్ధిదారులకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా, వారి దైనందిన జీవితంలో స్వయం సమర్థతను పెంచి సమాజంలో మరింత గౌరవప్రదంగా జీవించేందుకు దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ప్రతి పథకం నిజమైన అర్హులకు చేరేలా కట్టుదిట్ట మైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ధర్మవరం నియోజకవర్గానికి ఎంపికైన 10 మంది లబ్ధిదారులు తమకు ఈ విలువైన వాహనాలను అందించిన రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి సత్యకుమార్ యాదవ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# ఉనికి కోసమే వైసిపి అసత్య ఆరోపణలు మంత్రి సవిత.

వైసీపీ ది దోపిడీ పాలన, టీడీపీ ది అభివృద్ధి సవిత.

కృష్ణా జలాలతో రాయలసీమ సస్యశ్యామలం ను చేసిన ఘనత చంద్రబాబుదే.

5 ఏళ్లలో వైసిపి రాయలసీమ కు చేసింది సూన్యం.

పలు అభివృద్ధి, భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత.



**పెనుకొండ, పెన్ సత్తా, జులై 21:** వైసీపీ పార్టీ ఉనికి కోసమే పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సవిత మండి పడ్డారు. కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకువచ్చి రతనాలసీమగా అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దని, 5 ఏళ్ల వైసిపి పాలనలో గాల్లో వచ్చి, సినిమా సెట్టింగు లు వేసి హడావుడి తప్ప రాయలసీమకు జగన్ మోహన రెడ్డి చేసింది ఏమీ లేదని విమర్శించారు. మంత్రి సవిత పెనుకొండ మండలం కురుబవాండ్లపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిపురంలో రూ.35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే హరిపురం, కురుబవాండ్లపల్లి మధ్య రూ.50 లక్షలతో చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం కనకదాసు విగ్రహం నుంచి ఎస్సీ, బీసీ కాలనీల వరకు రూ.40 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. రూ.34 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న అంగన్వాడీ భవనానికి కూడా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ కీయా పరిశ్రమ ఏర్పాటు వల్ల ఈ ప్రాంతంలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరిగాయని, అర్హత కలిగిన యువతకు ఉద్యోగాలు లభిస్తున్నాయని తెలిపారు. కీయా రాకతో భూముల విలువ పెరగడంతో పాటు ప్రాంత అభివృద్ధికి ఊతమిచ్చిందన్నారు. కీయా సీఎస్ఆర్ నిధుల ద్వారా నియోజకవర్గంలో సుమారు రూ.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో రూ.12 కోట్లతో ఐటీఐ కళాశాల నిర్మాణం, రూ.2 కోట్లతో ఆసుపత్రి అభివృద్ధి, సుమారు రూ.2.5 కోట్లతో 7 అంగన్వాడీ భవనాల నిర్మాణం, మునిమడుగు రూ.40 లక్షలతో చెక్డ్యామ్, గుట్టూరులో డైనింగ్ హాల్ నిర్మాణం, రూ.4 కోట్లతో రైతులకు ప్లాంటేషన్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని, అర్హులైన వారికి పెన్షన్లు, గృహ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్న కీయా యాజమాన్యానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీది దోపిడీ పాలన.. టీడీపీది అభివృద్ధి. కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకొచ్చి రతనాల సీమగా అభివృద్ధి చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో గాల్లో వచ్చి, సినిమా సెట్టింగ్ ల వేసి, కొబ్బరికాయలు కొట్టి హడావుడి తప్ప రాయలసీమకు జగన్ చేసిందేమీ లేదని విమర్శించారు. దోపిడీకి కేరాఫ్ అడ్రస్ వైసీపీ అని మండి పడ్డారు. ప్రపంచమంతా ఎల్ నినో ప్రభావంతో విలవిలలాడుతుంటే రాయలసీమలో చెరువులు, ఇతర నదులు జలకళతో కళకళలాడుతున్నాయని, దానికి కారణంగా సీఎం చంద్రబాబేనని అన్నారు. అటు కుప్పం, ఇటు మడకశిర వరకూ కృష్ణా జలాలను తీసుకొచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమను హార్టీ కల్చర్ హబ్ గా తీర్చిదిద్దుతున్నారు అన్నారు. రాయలసీమ లోని అన్ని జిల్లాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. రాయలసీమ ప్రాంతానికి మొట్ట మొదటిసారిగా ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలు తీసుకొచ్చారని మంత్రి సవిత గుర్తు చేశారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే, రాయలసీమ లోని చివరి ఎకరాకు కూడా సాగునీరందుతుందని మంత్రి సవిత తెలిపారు. పులివెందులకు కూడా సాగు, తాగు నీరందించిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. రాయలసీమ ప్రాంత ముద్దు బిడ్డగా ఈ ప్రాంత అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడు రేయింబవళ్లు కృషి చేస్తున్నారని కొనియాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారు అన్నారు. ఆనాడు జగన్ అసమర్థతను వైసీపీ నాయకులు, ఎమ్మెల్యేలు ఎందుకు ప్రశ్నించలేకపోయారని నిలదీశారు. దోపిడీకి కేరాఫ్ అడ్రస్ వైసీపీ అని తీవ్రంగా మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# పెనుకొండకు శాశ్వత తాగునీటి పరిష్కారానికి కీలక ముందడుగు.

నగర, పంచాయతీకి తాగునీటి సరఫరా కోసం 0.18 టీఎంసీ నీటి కేటాయింపు.



**పెనుకొండ, పెన్ సత్తా, జులై 21:** పెనుకొండకు శాశ్వత తాగునీటి పరిష్కారానికి కీలక ముందడుగు పడిందని మంత్రి సవిత తెలిపారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని,హంద్రీ--నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు లోని మడకశిర బ్రాంచ్ కాలువ పై ఉన్న గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి 0.18 టీఎంసీ నీటిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమం, ఈడబ్ల్యూఎస్ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. పెనుకొండ పట్టణ ప్రజలకు భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, అమృత్ 2.0 పథకం కింద తాగునీటి సరఫరా మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని మంత్రి సవిత తెలిపారు. పెనుకొండ నగర పంచాయతీకి తాగునీటి కేటాయింపు చేయాలని ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి పై జల వనరుల శాఖ సానుకూలంగా స్పందించి, అవసర మైన సాంకేతిక నివేదికను సమర్పించగా, ప్రభుత్వం 0.18 టీఎంసీ నీటి కేటాయింపునకు అనుమతి మంజూరు చేసినట్లు మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ నీటి కేటాయింపుతో అమృత్ 2.0 పథకం కింద తాగునీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేసి, పెనుకొండ పట్టణ ప్రజలకు దీర్ఘకాలికంగా సురక్షిత మైన తాగునీటిని అందించేందుకు అవకాశం కలుగుతుందని మంత్రి సవిత తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కి, మంత్రి సవిత కృతజ్ఞతలు తెలిపారు. పెనుకొండ నియోజకవర్గ అభివృద్ధి, తాగునీటి వసతుల మెరుగుదల, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు.

# రూ.17.5 కోట్లతో ఫ్రెస్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్.

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి రామ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రకటన.
- డంపింగ్ యార్డ్ లో చెత్త ప్రాసెసింగ్ పనల పరిశీలన.
- పనుల ఆలస్యం పై కాంట్రాక్టర్ల పై ఆగ్రహం, నోటీసులు జారీ.
- మరోసారి ఇలాగే ఉంటే కాంట్రాక్టులు రద్దు చేసి బ్లాక్ లీస్ట్ లో పెడుతాం.
- ఈ చెత్తంతా వైసీపీ పాపమేనన్న ఛైర్మన్ పట్టాభి, ఎమ్మెల్యే దగ్గుపాటి.

**అనంతపురం, పెన్ సత్తా, జులై 21:** పట్టణం లోని డంపింగ్ యార్డ్ లో 17.5 కోట్ల రూపాయలతో ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నట్టు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి రామ్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. మంగళవారం వీరు అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి డంపింగ్ యార్డును పరిశీలించి, చెత్త ప్రాసెసింగ్ ఎలా జరుగుతోందన్నది ఆరాతీశారు. ఇప్పటి వరకు ఎంత మేర చెత్త క్లియర్ చేశారు, వేస్టే ఎక్కడ వేస్తున్నారు, ఎప్పటి లోగా మొత్తం పూర్తి చేస్తారన్న వివరాలను కాంట్రాక్టర్లతో పాటు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం పై ఛైర్మన్ పట్టాభి రామ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్టోబర్ 2 లోగా మొత్తం చెత్తను క్లియర్ చేయాలని మరోసారి నిర్లక్ష్యం కనిపిస్తే కాంట్రాక్టులను రద్దు చేయడమే కాకుండా బ్లాక్ లీస్టులో పెడుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పట్టాభి రామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పేరుకపోయి ఉన్న చెత్తను కూటమి ప్రభుత్వం వచ్చాక క్లియర్ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా అనంతపురం డంపింగ్ యార్డులో గత ప్రభుత్వం 3.78 లక్షల టన్నుల చెత్త పెట్టిపోతే.. ఇప్పటి వరకు 2.41లక్షల టన్నుల చెత్తను తొలగించామన్నారు. పనుల కొంత వరకు ఆలస్యమైన మాట వాస్తవేమనన్నారు. అయితే ఇక నుంచి ప్రతి వారం టార్గెట్లు ఇచ్చి పని చేయిస్తామన్నారు. మూడు నెలల్లోగా మొత్తం చెత్తను క్లియర్ చేస్తామన్నారు. ఇందు కోసం ప్రత్యేక యంత్రాలను కూడా తీసుకొచ్చారన్నారు. ప్రతి రోజు 4 వేల టన్నుల చెత్తను క్లియర్ చేసేలా పనులు జరుగుతున్నాయన్నారు. మరో వైపు డంపింగ్ యార్డుకు కొత్తగా వస్తున్న చెత్తను క్లియర్ చేసేందుకు ఫ్రెష్ వేస్టే మేనేజ్మెంట్ ప్లాంట్ ను రూ.17.5 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇందుకు అవసర మైన స్థలాన్ని ఆగష్టు 15 నాటికి సిద్ధం చేస్తామన్నారు. ప్రతి రోజు 170 మెట్రిక్ టన్నుల చెత్తను క్లియర్ చేసేలా ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. మరో వైపు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు చెత్త పై పన్నులు వేస్తూ లక్షల టన్నుల చెత్తను పెట్టిపోయారన్నారు. గత ప్రభుత్వంలో 85 లక్షల టన్నుల చెత్త ఉంటే ఇప్పటికే 70 లక్షల చెత్తను క్లియర్ చేశారన్నారు. గత ప్రభుత్వంలో 3.40 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేశామని అప్పటి ఎమ్మెల్యే కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడ్డారని విమర్శలు చేశారు. వచ్చే అక్టోబర్-2 నాటికి అనంతపురం డంపింగ్ యార్డ్ లో చెత్త లేకుండా చేస్తామన్నారు. ఆగష్టు-15 నాటికి ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ కు స్థలాన్ని సిద్ధం చేస్తామన్నారు. అక్టోబర్-2 నుంచి ఆ ప్లాంట్ పనులు ప్రారంభించేలా పనులు చూస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# మీ భూమి - మీ హక్కు కొణతాల

ప్రభుత్వ రాజ్యముద్రలతో పట్టాదారు పాస్ పుస్తకములు పంపిణీ.





**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 21:** అనకాపల్లి మండలం, కొండుపాలెం పంచాయతీ, చేనుల అగ్రహారం గ్రామంలో మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా రైతులకు పాస్ బుక్ ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ మాట్లాడుతూ భూ రికార్డుల్లో చోటుచేసుకున్న లోపాలు, వివాదాలను పూర్తిగా సరిదిద్ది ప్రతి భూ యజమానికి సరైన హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. రీసర్వే అయిన భూములకు రైతుల పేర్లతో, రైతుల ఫొటోలతో కూడిన, రాజ ముద్ర, సరికొత్త క్యూఆర్ కోడ్ తో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. రీసర్వే ప్రక్రియలో ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే రైతులు నిర్భయంగా సంబంధిత అధికారులకు దరఖాస్తు చేయాలని, ప్రతి ఫిర్యాదును పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భూ రికార్డులను పారదర్శకంగా శాశ్వతంగా భద్రపరిచేందుకు ఆధునిక సాంకేతికతో వినియోగిస్తూ భవిష్యత్తులో మరింత సురక్షిత మైన పద్ధతిని అమలు చేయనున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు. సామాజిక భద్రతా పెన్షన్, తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఆర్థిక సహాయం జమ చేయబడుతుందని, గ్రామీణ రహదారుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

అలాగే, ఓటరు జాబితా ప్రత్యేక పరిశీలన కార్యక్రమంలో (ఎస్ఐఆర్) ప్రతి అర్హుడూ తన పేరు నమోదు చేసుకోవాలని, అవసర మైన వివరాలను సంబంధిత బీఎల్వోలకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే, భూ రికార్డుల ప్రక్షాళన, సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని, రైతుల హక్కుల పరి రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగన్,

కొండూపాలెం ఎంపీటీసీ, జనసేన నాయకులు మధుపాడు లక్ష్మణరావు, చదరం నాగేశ్వర రావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కర్రీ బాబి, పిఎసిఎస్ అధ్యక్షులు బంటు రవి, ఎమ్మార్వో ఆనంద, ఎండిఓ ఆసాజ్యోతి, తలారి కాశీనాయుడు, గంగు పాము జగదీష్, కొండుపాలెం చేను అగ్రహారం

కూటమి ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# అనారోగ్యానికి గురైన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం.



**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 21:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చొరవతో పేదల ఆరోగ్య రక్షణకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా విశేష సహాయం అందుతోంది అని మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. నియోజకవర్గానికి చెందిన అత్యవసర చికిత్స పొందిన లబ్ధిదారుగాను రూ.31,084 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును వారి కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీదైన వైద్య చికిత్సలు చేయించు కోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్సకు నోచుకోలేని కుటుంబాలకు ఈ పథకం గొప్ప భరోసాగా నిలుస్తోందన్నారు. గత 25 నెలల కాలంలో అనకాపల్లి నియోజకవర్గంలో వందలాది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఈ సహాయం అందేలా కృషి కొనసాగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారుని కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కి తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లకు అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన.

- 32 కి.మీ. మేర రహదారులు, భద్రత, లైటింగ్ పనుల పై సమగ్ర సమీక్ష.
- తొలి పావంచ వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్.. మార్గంలో 30 సహాయ కేంద్రాలు.
- నిఘా కోసం 18 డ్రోన్ కెమెరాలు..
- పిల్లలు, వృద్ధులకు తొలిసారి ఆర్ఎఫ్ఐడి ట్యాగింగ్.
- పీక్ అవర్స్‌లో ట్రాఫిక్ ఆంక్షలు.. ప్రజలు సహకరించాలని సీపీ విజ్ఞప్తి.









**సింహాచలం, పెన్ సత్తా, జులై 21:**ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న ప్రతిష్ఠాత్మక సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవాన్ని పురస్కరించుకుని భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఆలయ ఈవో జల్లేపల్లి వెంకట రావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్, జాయింట్ కలెక్టర్లతో కూడిన ఉన్నతాధికారుల బృందం మొత్తం 32 కిలో మీటర్ల గిరి ప్రదక్షిణ మార్గాన్ని క్షేత్రస్థాయిలో సంయుక్తంగా పరిశీలించింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే తొలి పావంచ ప్రాంతంతో పాటు మార్గమంతటా రోడ్లు, విద్యుత్, పారిశుధ్యం, తాగునీరు, లైటింగ్ ఏర్పాట్లను అధికారులు సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న రహదారి పనులు, అండర్ గ్రౌండ్ కేబులింగ్ పనులను, ముఖ్యంగా గోపాలపట్నం ప్రాంతం లోని రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి మార్గాన్ని సున్నితంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో నడిచే భక్తుల కోసం మార్గమంతటా తగినంత లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. తొలి పావంచ వద్ద ప్రధాన కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌ను, మార్గంలో మరో 6 నుంచి 7 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

మార్గంలో 30 సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి, సుమారు 38 కీలక ప్రాంతాల్లో సీనియర్ అధికారులను విధుల్లో నియమిస్తున్నారు. పారిశుధ్య, తాగునీరు, వైద్య సిబ్బంది షిఫ్టుల వారీగా అందుబాటులో ఉంటారు. గిరి ప్రదక్షిణ రోజుల్లో హెల్త్ సిటీ పరిధి లోని ఆసుపత్రులు అత్యవసర సేవలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని, సాధారణ వైద్య ప్రక్రియలను వాయిదా వేసుకోవాలని సూచించారు. భక్తుల రద్దీని పర్యవేక్షించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 18 డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నారు. చైన్ స్నాచింగ్‌లను అరికట్టేందుకు ప్రత్యేక క్రైమ్ పార్టీలను రంగంలోకి దించారు. జనసందోహంలో పిల్లలు, వృద్ధులు తప్పిపోకుండా ఉండేందుకు ఈసారి తొలిసారిగా ఆర్ఎఫ్ఐడి ట్యాగులు ఏర్పాటు చేయనున్నారు. విజయనగరం, అనకాపల్లి వైపుల నుంచి వచ్చే వాహనాలకు ప్రత్యేక ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేస్తున్నారు. హనుమంతవాక నుంచి మద్దిలపాలెం వరకు పాత జాతీయ రహదారి మార్గాన్ని పూర్తిగా ట్రాఫిక్ ఫ్రీ జోన్ గా ఉంచుతారు. రద్దీ సమయాల్లో వాహనాలను తాత్కాలికంగా నిలిపివేయాల్సి రావచ్చునని, దీని పై త్వరలోనే పూర్తిస్థాయి 'ట్రాఫిక్ అడ్వైజరీ' విడుదల చేస్తామని సీపీ తెలిపారు. అలాగే, జోడుగుళ్లపాలెం నుంచి అప్పుఘర్ బీచ్ రోడ్డులో ప్రయాణించే ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని ఆయా సంస్థలను కోరుతామన్నారు.

ఒక్క చిన్న అవాంఛనీయ సంఘటన కూడా జరగకుండా భక్తులందరూ ప్రశాంతంగా గిరి ప్రదక్షిణ నిర్వహించుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఆలయ ఈవో జల్లేపల్లి వెంకటరావు స్పష్టం చేశారు.

# బీజేపీ అసెంబ్లీ సంస్థాగత సమావేశంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్








- మంత్రి సమక్షంలో బీజేపీలో 150 మందికి పైగా చేరిక
- ధర్మవరంలో కమలం జోరు.. సంస్థాగత సమావేశం అనంతరం బీజేపీలో భారీ చేరికలు.
- సంస్థాగత బలోపేతమే బీజేపీ విజయాలకు మూలం.
- సిద్ధాంతం.. సేవ.. సంస్థాగత బలం.. ఇవే బీజేపీ విజయ రహస్యాలు.
- ప్రతి కార్యకర్త ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలి.
- "మన్ కీ బాత్" స్ఫూర్తితో సమాజంలో మార్పు తీసుకురావాలి.

**ధర్మవరం, పెన్ సత్తా, జులై 21:** భారతీయ జనతా పార్టీని దేశం లోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా నిలబెట్టింది కార్యకర్తల త్యాగం, క్రమశిక్షణ, సిద్ధాంత నిబద్ధతేనని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య, శాఖా మంత్రి, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ అన్నారు. ధర్మవరం నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహించిన ధర్మవరం అసెంబ్లీ సంస్థాగత సమావేశంలో ఆయన పాల్గొని పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజాసేవ, భవిష్యత్ కార్యాచరణ పై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సాధారణ రాజకీయ పార్టీ కాదని, దేశసేవ, జాతీయత, అంత్యోదయ సిద్ధాంతాలపై నిర్మితమైన మహోన్నత సంస్థ అని అన్నారు. సమాజం లోని చివరి వ్యక్తికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించాలన్నదే బీజేపీ లక్ష్యమని, ప్రతి కార్యకర్త అదే స్ఫూర్తితో ప్రజల్లో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న "మన్ కీ బాత్" కార్యక్రమం దేశ ప్రజలతో ప్రత్యక్ష అనుబంధాన్ని పెంపొందించిన వినూత్న కార్యక్రమమని మంత్రి పేర్కొన్నారు. రైతులు, యువత, మహిళలు, శాస్త్రవేత్తలు, సామాజిక సేవకులు సాధించిన విజయాలను దేశానికి పరిచయం చేస్తూ ప్రతి భారతీయుడిలో స్ఫూర్తిని నింపుతున్న కార్యక్రమమిదని, ప్రధానమంత్రి తనను తాను "ప్రధాన సేవకుడు"గా భావిస్తూ దేశసేవకు అంకితమయ్యారని కొనియాడారు. ప్రపంచం లోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీగా బీజేపీ ఎదగడం వెనుక కోట్లాది మంది కార్యకర్తల నిస్వార్థ సేవ, త్యాగం, క్రమశిక్షణ ఉన్నాయని మంత్రి తెలిపారు. భారతీయ జనసంఘ్ నుంచి ప్రారంభమైన సిద్ధాంత ప్రస్థానం నేడు దేశ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న మహా ఉద్యమంగా రూపుదిద్దుకుందని, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ వంటి మహనీయుల త్యాగాలు పార్టీకి బలమైన పునాదిగా నిలిచాయని గుర్తు చేశారు. పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలు, శక్తికేంద్రాలు, మండల కమిటీలు, మోర్చాలు సమర్థంగా పనిచేయాలని, పదవి అనేది గౌరవం మాత్రమే కాకుండా ప్రజల పట్ల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించినప్పుడే సంస్థాగతంగా పార్టీ మరింత బలపడుతుందని వివరించారు. మహిళా మోర్చా, యువ మోర్చా, కిసాన్ మోర్చా, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మోర్చాలతో పాటు అన్ని అనుబంధ విభాగాలను గ్రామ స్థాయి వరకు బలోపేతం చేయాలని, సీనియర్ కార్యకర్తలను గౌరవిస్తూ వారి అనుభవాన్ని కొత్త తరానికి అందించాలని సూచించారు. సమాజంలో ప్రభావం కలిగిన వ్యక్తులతో సత్సంబంధాలు పెంపొందించి పార్టీ విస్తరణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేర్చాలని మంత్రి సూచించారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. అలాగే పార్టీ కార్యక్రమాలను, ప్రజాసేవా కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి కార్యకర్త సరల్ పోర్టల్ లో నమోదు చేసుకుని పార్టీ కార్యక్రమాలను నిరంతరం అప్‌డేట్ చేయాలని సూచించారు. టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకుంటూ కేంద్ర నాయకత్వం దృష్టికి పార్టీ కార్యకలాపాలు చేరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం అనంతరం బీజేపీలో భారీ చేరికలు చోటుచేసుకున్నాయి. ధర్మవరం పట్టణం 1వ వార్డు నుంచి వేటూరి చిన్న పోతులయ్య, ఆయన మిత్రబృందం, అలాగే 39 వ వార్డు నుంచి వేటూరి వేణుమాధవ్, వేటూరి హక్కులప్ప వారి ఆధ్వర్యంలో దాదాపు 150 మందికి పైగా నాయకులు, యువకులు, కార్యకర్తలు రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం, కేంద్ర ప్రభుత్వ ప్రజాహిత పాలన, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పెద్ద ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీలో చేరడం పార్టీ పై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. కొత్తగా పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ ప్రజాసేవ లక్ష్యంగా పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని, ధర్మవరం నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు జి.ఎం. శేఖర్ జిల్లా ఇంచార్జ్ కునిగిరి నీలకంఠ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్, రాష్ట్ర కార్యదర్శి సంధిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు సాకే ఓబులేసు, అమర దేవేంద్ర, ధర్మవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ చైర్ పర్సన్ అంబటి అరుణ శ్రీ, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణ యాదవ్, జెడ్పిటిసి సభ్యురాలు కోటి సుధా, బిజెపి సీనియర్ నాయకులు అంబటి సతీష్, పట్టణ, మండలాల అధ్యక్షులు జింక చంద్రశేఖర్, గొట్లూరు చంద్ర, దేవర రామ్మోహన్, ఆకులేటి భాస్కర్, అంజన్ రెడ్డి, శక్తికేంద్ర ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, సీనియర్ కార్యకర్తలు, యువ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఏది ?.




**గోదావరి, పెన్ సత్తా, జులై 21:**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం లోని టిడిపి నేతలు రాష్ట్రంలో మహిళను వివస్త్రను చేసి వేధించిన ఘటనను ఖండిస్తూ తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్పర్సన్, రుడా చైర్పర్సన్, రాష్ట్ర పార్లమెంట్ కార్యదర్శి, ఆచంట నియోజకవర్గ పరిశీలకులు మేడపాటి షర్మిళ రెడ్డి, మాజీ హోం శాఖ మంత్రి తానేటి వనిత ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. మంగళవారం కోటిపల్లి బస్టాండ్ దగ్గర నుండి డీలక్స్ సెంటర్ వరకు నిరసన ర్యాలీలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రంపచోడవరం నియోజవర్గం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొని చంద్రబాబు నాయుడుకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్త లక్ష్మీ, మహిళ నాయకులు పోలు విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ చోడిశెట్టి సత్యవేణి, మాజీ చైర్పర్సన్ సంకిస భవాని, ఆచంట అనసూయ, సత్య, కృష్ణవేణి, సరిత, దేవి, సూర్య కుమారి, అలాగే రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్, మండల స్థాయి పార్టీ పదవుల్లో ఉన్న మహిళలు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ప్రెసిడెంట్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వైయస్ఆర్ సీపీ శ్రేణులు. భారీ ఎత్తున పాల్గొనికూటమి ప్రభుత్వం, చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# చంద్రబాబు అభివృద్ధి ఆలోచనలు.. జగన్ వి విధ్వంస విధానాలు ప్రత్తిపాటి.

- **అధికారంలో ఉన్నప్పుడు జేట్యాక్స్ తో, ఇప్పుడు జేగ్యాంగ్ తో జగన్ అరాచకం.**
- **అవినీతి మీడియా, పేటీఎం బృందంతో జగన్ సాగిస్తున్న విషప్రచారం.**
- **చిన్న చిన్న విషయాల్ని గోరంతలు, కొండంతలుగా చూపుతూ, గొడ్డలిపార్టీ అభివృద్ధి నిరోధకశక్తిగా తయారైంది.**
- **కూటమి శ్రేణుల ఐక్యత, ప్రజా మద్ధతు తో వైసీపీ అభ్యర్థులు నామినేషన్ కే వెనుకాడాలి.**
- **మైదవోలు, బుక్కాపురం గ్రామాల్లో రూ.23 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి.**

**చిలకలూరిపేట, పెన్ సత్తా, జులై 21:**జగన్, వైసీపీ నేతలు, వారి తొత్తుగా మారిన అవినీతి మీడియా, పేటీఎమ్ బృందం, చిన్నచిన్న విషయాల్ని కూడా గోరంతలు కొండంతలు చేస్తూ అభివృద్ధి నిరోధక శక్తులుగా వ్యవహరిస్తున్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారంలో ఉన్నప్పుడు జే ట్యాక్స్ తో పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తల్ని భయపెట్టిన జగన్.. నేడు తన గోబెల్ ముఠా దుష్ప్రచారంతో పెట్టు బడిదారులు, పెట్టుబడుల్ని అడ్డుకుంటూ, చంద్రబాబు, లోకేష్ ల కష్టాన్ని నీరుగార్చే ప్రయత్నాల్ని నిరంతరం కొనసాగిస్తున్నాడని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం యడ్లపాడు మండలం మైదవోలు, నాదెండ్ల మండలం బుక్కాపరం గ్రామాల్లో పర్యటించిన ప్రత్తిపాటి, స్థానిక నాయకులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. తొలుత బుక్కాపురంలో రూ.13 లక్షల సర్వశిక్షా అబియాన్ నిధులతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపనచేసిన ప్రత్తిపాటి, అనంతరం మైదవోలులో రూ.10 లక్షలతో నిర్మించే బీసీ సామాజిక భవనానికి, ఎస్సీ, బీసీ శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రెండు గ్రామాల్లో ప్రజల్ని ఉద్దేశించి మాట్లాడారు.

చంద్రబాబు అభివృద్ధి, జగన్ విధ్వంసం మధ్యే 'స్థానిక' పోరులి కూటమిలో ప్రధాన పక్షమైన తెలుగుదేశం, మిత్ర పక్షాలైన జనసేన, బీజేపీలతో ఉన్న మైత్రి బంధాన్ని మరింత బలపరుచు కోవాలని, వ్యక్తిగత ప్రయోజనాల కంటే వ్యవస్థల పటిష్టతకే శ్రేణులు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రత్తిపాటి సూచించారు. అభిప్రాయబేధాలు, మాట పట్టింపుల్ని పక్కన పెట్టి మూడు పార్టీల శ్రేణులు ఐక్యంగా, సమిష్టిగా పనిచేస్తే గొడ్డలిపార్టీ శాశ్వతంగా కనుమరుగు అవుతుందన్నారు.

జగన్ దృష్టి, ఆలోచనలు ఎప్పుడూ ప్రజల్ని, రాష్ట్రాన్ని ఎలా నాశనం చేయాలనే కోణం లోనే ఉంటాయని, ఈ వాస్తవాన్ని ఇప్పటికే ఏపీ వాసులు గ్రహించారని ప్రత్తిపాటి చెప్పారు. చంద్రబాబు అభివృద్ధికి, జగన్ విధ్వంసానికి మధ్య ఉన్నతేడా ప్రజలకు పూర్తిగా అర్థమైందని, త్వరలో జరిగే స్థానిక ఎన్నికలు ఈ రెండు అంశాల రెఫరెండంగానే ఉంటాయన్నారు. రెండేళ్లలో ఏ రాష్ట్రానికి సాధ్యం కాని అభివృద్ధి, సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిందని, దాంతో వారి నమ్మకం, విశ్వాసం పెరిగాయన్నారు. ప్రజల మనసుల్లో కూటమిపార్టీల పై ఉన్న సానుకూలత, సదభిప్రాయాన్ని స్థానిక ఎన్నికల్లో శ్రేణులు గొప్ప విజయంగా మలచాలని ప్రత్తిపాటి సూచించారు. కూటమి శ్రేణుల ఐక్యతతో వైసీపీ అభ్యర్థులు నామినేషన్ వేయడానికే వెనకడుగు వేసే పరిస్థితులు రావాలన్నారు.







కుట్రలు, కుతంత్రాలు తప్ప ప్రజలు, రాష్ట్రం గురించి ఆలోచించని వైసీపీకి ఎప్పటికీ ప్రజాదరణ లభించదని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు.

మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టి, సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని, వాటి ఫలితాలనే నేడు విద్యార్థులు అనుభవిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల్ని తలదన్నేలా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం పై ఉపాధ్యాయులతో పాటు ప్రజలు గర్విస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివ రావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, జవ్వాజి మధన్ మోహన్, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, బీజేపీ నేతలు మల్లెల శివనాగేశ్వర రావు, నెల్లూరి రంజిత్, టీడీపీ నాయకులు పోపూరి వెంకయ్య, రాఘవయ్య, సిలార్, గేర్ అశోక్, యేసు దాసు, సుభాని, మాడ శ్రీను, సింగయ్య, జయప్రసాద్, నక్క పోతురాజు, నక్క కోటేశ్వరరావు, భాస్కర్, వెంకటేశ్వర్లు, థామస్, ఇంకేశ్వరావు, గ్రామ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే చింతమనేని.







**దెందులూరు, పెన్ సత్తా, జులై 21:**47 లక్షలతో చేసిన సోమవరప్పాడు కొత్త చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే చింతమనేని. పిఎంకేఎస్వై 2.0 - వీబీజీ రాంజీ పథకం కింద చెరువు గట్టు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల పార్కు అభివృద్ధి పనులను మంగళవారం చింతమనేని పరిశీలించారు. దెందులూరు మండలం, సోమవరప్పాడు గ్రామంలో 47 లక్షల రూపాయలతో చేపట్టిన చెరువు అభివృద్ధి పనులను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు సురేష్, మణికంఠ లతో కలిసి మంగళవారం పరిశీలించారు.

గ్రామం లోని కొత్తచెరువు ను వీబీజీ రాంజీ పథకం లో భాగంగా, వాటర్‌షెడ్ డెవలప్మెంట్ కాంపోనెంట్ - ప్రధానమంత్రి కృషి సించాయి యోజన 2.0 కార్యక్రమంలో అభివృద్ధి చేస్తున్నారు. ఈ కార్యక్రమం క్రింద చెరువు గట్టు పటిష్ట పరచడం, వాకింగ్ ట్రాక్, పిల్లల పార్కు, ఓపెన్ జిమ్, సోలార్ లైట్ల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పనులను క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత సమయం లోపు పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఫాతిమా, సాంకేతిక సహాయకులు సారథి, దీప్తి, సహకార సంఘం అధ్యక్షులు వి.ఆర్.కె. నాని, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణీలకు పౌష్టిక ఆహారం ని పంపిణీ చేశారు.

**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 21:**రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ఆసుపత్రిలో మంగళవారం గర్భిణీలకు పౌష్టిక ఆహారం ని పంపిణీ చేశారు. ప్రతి నెల సేవా కార్యక్రమాలు భాగంగా ఈనెల గర్భిణీలకు పోస్టుకు ఆహారం పంపిణీ చేస్తున్నామని అధ్యక్షులు బొగ్గారపు సోమ సుందర్రావు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ హాస్పిటల్ డైరెక్టర్ డిడి నాయుడు పాల్గొని పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లు లు మీరు మంచి పౌష్టికాహారం తీసుకొని పిల్లల్ని బాగా చూసుకోవాలన్నారు. అలాగే మీరు చెవిలోకి, ముక్కులోకి, కంట్లోకి మాములు నూనెలతో కంటికి కాటుక పెట్టకూడదని, అలాగే కూర్చోబెట్టి పాలు పట్టాలని, పిల్లలకి మీరు ధూపం ధోపాలు వేయడం మంచిది కాదని తెలిపారు. మీరు మంచి పౌష్టికాహారం తీసుకొని మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకుంటూ పిల్లలు సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్బు కార్యదర్శి ఏవీఎస్ కుష్యాంత్, ట్రెజరర్ ఎస్ కృష్ణ, బుద్ధ రమణజీ, ఎల్ ఎన్ కుమార్ కే ఎల్ ఎల్ కుమార్, మల్లేశ్వరరావు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# చికెన్, మటన్, చేపల వర్తకుల పై మెరుపు దాడులు.







**విశాఖపట్నం, పెన్ సత్తా, జులై 21:**తూకంలో మోసం అంటూ తరచుగా వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో లీగల్ మెట్రాలజీ అధికారులు వాసవానిపాలెం(గాదిరాజు ప్యాలస్ వద్ద), వాళ్తేరు పరిసరాల్లో ఉన్న వ్యాపారుల పై మెరుపు దాడులు నిర్వహించారు. ముందస్తుగా ఒక పథకం ప్రకారం గాదిరాజు ప్యాలస్ వద్దకు చేరుకొని, పోలీస్, మీడియా సహకారంతో అందరూ మూకుమ్మడిగా చేపల వర్తకులు వినియోగిస్తున్న తూకపు రాళ్లు, తూనిక యంత్రాలు పరిశీలించి తేడా ఉన్నవాటిని సీజ్ చేసి 7 మంది పై కేసులు నమోదు చేశారు. ఈ సందర్బంగా ఇన్స్పెక్టర్ యం. దామోదర నాయుడు మాట్లాడుతూ దాడుల్లో తూకపు రాళ్లు 100 నుండి 250 గ్రాములు వరకు తేడాలు ఉన్నట్లు గుర్తించామని, తూనిక యంత్రాలు మాత్రం సక్రమంగా ఉన్నాయని గుర్తించినట్లు తెలిపారు. ఆ తరువాత వాళ్తేరు, మురళీనగర్ ఏరియాలలో వివిధ వ్యాపార సంస్థల పై తనిఖీలు నిర్వహించి తూనిక యంత్రాలు సీలు వేయించు కోని వారి పై, తూకంలో మోసాలు చేస్తున్న వారి పై మొత్తం 10 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఈరోజు మొత్తం తనిఖీలలో 17 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వ్యాపారస్థులను హెచ్చరిస్తూ, వ్యాపారానికి వినియోగించే ప్రతీ తూనిక యంత్రం, కొలతలు, తూనిక రాళ్లు ఖచ్చితంగా శాఖా వారితో సీలు వేయించి వెరిఫికేషన్ సర్టిఫికెట్ పొందాలని, తూకంలో గానీ, కొలతలో మోసాలకు పాల్పడవద్దని సూచించారు. వినియోగదారులు ఎవరైనా తూకం లేదా కొలతలో మోసాలు గమనిస్తే ఎలాంటి సందేహం లేకుండా 1967 నెంబర్ కు ఫిర్యాదు చేయాలని కోరారు.

# ప్రజా దర్బార్ కి విశేష స్పందన.

అర్జీదారుల వద్దకు వచ్చి వినతులు స్వీకరించిన చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్.



**విజయనగరం, పెన్ సత్తా, జులై 21**: వి ఎం ఆర్ డి ఎ జోనల్ కార్యాలయంలో మంగళవారం వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ నేతృత్వంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కి విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి పెద్ద ఎత్తున అర్జీదారుల రావటంతో చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ వారందరి వద్దకు వచ్చి వినతులు స్వికరించారు. ఆయన స్వయంగా అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని, వారి నుంచి వినతులు స్వీకరించారు. ఆయా వినతులను పరిశీలించి తర్వాత సంబంధిత అధికారులతో మాట్లాడి అవసర మైన చర్యలు తీసుకోవాలని, అవసరాన్ని బట్టి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని, అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. వి ఎం ఆర్ డి ఎ పరిధి లోని ప్రజలు తమ సమస్యలను విన్నవించటానికి విశాఖ వరకు రానవసరం లేదని, విజయనగరంలో జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయటం జరిగిందని, ఇక్కడ ప్రతీ మంగళవారం ప్రజా దర్బార్ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కి మొత్తం ఆరు వినతులు వచ్చాయి. వీటిలో ప్లానింగ్ విభాగానికి 2, ఇంజనీరింగ్ విభాగానికి 3, పరిపాలన విభాగానికి 1 చొప్పున అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, వి ఎం ఆర్ డి ఎ జిల్లా సమన్వయ అధికారి మహేశ్వరరావు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# పి.జి.ఆర్.ఎస్ పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి జిల్లా కలెక్టర్




**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 21**: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)పై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపు నిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మరింత పారదర్శకత, జవాబుదారీతనం దిశగాను, నిరంతర అభిప్రాయ సేకరణ చేసి పౌరుల సంతృప్తిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ.ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందని ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ తెలిపారు. జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ.ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పి.జి.ఆర్.ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని సమర్పించవచ్చని చెప్పారు. ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని సూచించారు. క్యూ.ఆర్ కోడ్ వలన ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్.ష్ట్రజూం://జూస్త్రతీం.ఖజూ.స్త్రశీజ.ఱఅ/ఎశీఎవ/ు=+తీఱవఝఱఎవ కు చేరుతుందని అన్నారు. ఆర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటి పై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కోరారు.

## పరశురామ వతారంలో దర్శనమిచ్చిన జగన్నాథ స్వామి





**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 21:** గవరపాలెం అగ్రిమర్రి చెట్టు వద్ద కొలువైన సుభద్ర, బలభద్ర, సమేత జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవంలో భాగంగా గూడ్స్ రోడ్ వద్ద ఉన్న ఇంద్రజ్యుమ్మ హాలు వద్ద కొలువైన జగన్నాథ స్వామి మంగళవారం భక్తులకు పరశురామ వతారంలో దర్శనమిచ్చారు.

ఈ సందర్భంగా మండపం వద్ద అన్న సమారాధన కార్యక్రమానికి మళ్ల అప్పల నాయుడు (బుజ్జి), శంకర్ల పద్మలతలు దనసహాయం చేశారు. ఆలయ మండపంలో రాఘవేంద్ర స్వామి బృందావన సమితి పారాయణం, నూకాంబిక కోలాట సంస్థ కోలాటం, గౌరీ అన్నమయ్య కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం ఆలయ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ కార్య నిర్వహణ అధికారి కె చంద్రతేజ, ఆలయ కమిటీ ధర్మకర్తలు బుద్ధ ఆదిలక్ష్మి, యల్లబిల్లి ధనలక్ష్మి, కాంద్రేగుల మహాలక్ష్మి, పేకేటి తులసి, భుగాతా కోటేశ్వరరావు, యండపల్లి చంద్రశేఖర్, మంగళపల్లి వివి సుబ్రహ్మణ్యం, బోడ్డేడ వెంకట చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.


## సెక్యూరిటీ గార్డులు కి కనీస వేతనం 26,000 ఇవ్వాలి.

### చట్ట ప్రకారం సౌకర్యాలు అమలు చేయాలి.



**పరవాడ, పెన్ సత్తా, జులై 21**: సెక్యూరిటీ గార్డ్స్, వాచ్మెన్ లకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను పెంచి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలని సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పరవాడ సిఐటియు కార్యాలయంలో సెక్యూరిటీ గార్డ్ లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ కనీస వేతనం 26,000 పెంచి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని, రోజుకి 8 గంటల పని అమలు చేయాలని, ఎనిమిది గంటలకు మించి పనిచేస్తే ఓవర్ టైం డబుల్ జీతం చెల్లించాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాడ్యుటీ, సెలవులు వంటి చట్టపర మైన సౌకర్యాల్ని అమలు చేయాలన్నారు. ప్రమాద, ఆరోగ్యబీమా సదుపాయం కల్పించాలన్నారు. సెక్యూరిటీ ఏజెన్సీలు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. ఈ నెల 30 న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు జిల్లాలో సెక్యూరిటీ గార్డు లు పెద్దయాత్ర పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ పి సత్యనారాయణ, వి. కృష్ణ, ఎం అచ్చితరావు తదితరులు పాల్గొన్నారు.

## వారాహి నవరాత్రులలో గూడుపమ్మకు ప్రత్యేక పూజలు



**నక్కపల్లి, పెన్ సత్తా జూలై 21 :** మండలంలోని రేబాక గూడుపమ్మ తల్లి ఆలయంలో ఆషాఢమాసం తొలి రోజు నుంచి ప్రత్యేక పూజలు ఘనంగా జరుగుతున్నాయి. వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవారికి ప్ర త్యేక కుంకుమార్చన పూజలు చేస్తున్నారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరి రాజు ఆధ్వర్యంలో వారాహీ నవరాత్రులను పురస్కరించుకుని ఈ ఆలయంలో పూజా 'కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. రోజూ సాయంత్రం నుంచి రాత్రి వరకూ ఆలయంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని సామూహిక కుంకుమార్చన, హారతులు అమ్మవారికి ఇస్తున్నారు . మంగళవారం వారాహీ కవచం, అష్టోత్తర పూజలు చేశారు. దీనిలో భాగంగా ఆలయ సింహస్తంభం వద్ద మహిళా భక్తులు ఓంకారం, త్రిశూలం ఆకారంలో అఖండ దీపారాధన చేపట్టారు. అమ్మవారికి సామూహిక హారతులు నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా దీపాల కాంతులతో భక్తులను పులకింపజేశాయి. పూజలనంతరం భక్తులకు విశే ష ప్రసాదాలను పంపిణీ చేశారు.

# జీవో 396 రద్దుచేసి దస్తావేజు లేఖర్లను ఆదుకోవాలి

### రెండో రోజు కొనసాగిన పెన్ డౌన్ .

**నక్కపల్లి, పెన్ సత్తా, జూలై 21:** జీవో నెంబర్ 396ను రద్దుచేసి దస్తావేజు లేఖర్ల కుటుంబాలకు భరోసా కల్పించాలని దస్తావేజులేఖర్ల సంఘ అధ్యక్షులు దాతారం మురళీకృష్ణ కోరారు. జీవో 396కు వ్యతిరేకంగా చేస్తున్న దస్తావేజు లేఖరుల పెన్ డౌన్ సమ్మె మంగళవారం రెండో రోజు చేరింది. ఈ సందర్భంగా స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద తమ వృత్తి భద్రతను కాపాడాలి అంటూ నిరసన తెలియజేశారు. జీవో నెంబర్ 396 రద్దు చేయాలని , పి పి పి విధానాల్లో దస్తావేజులు రిజిస్ట్రేషన్ జరగడం వలన తమ వృత్తిని కోల్పోయి వీధిని పడే అవకాశం ఉందని , తక్షణం రద్దు చేసి లేఖర్ల జీవనోపాధిని కాపాడాలని వారు కోరారు. తమ విధులను బహిష్కరించి పెన్ డౌన్ తో తమ నిరసన తెలియజేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు కొంగరచిన కృష్ణమూర్తి,



కార్యదర్శి బత్తుల శ్రీను, ఉపాధ్యక్షుడు ఎన్ వి రమణ, ట్రెజరర్ లోవరత్నం, సహాయ కార్యదర్శి డిఎంపి కుమార్, రాంబాబు, సూర్యనారాయణ, బొంతు రాజు, రమేషు ,గోవిందు, వరహాలు, శేఖర్, నూకరాజు, త్రినాధ్, ముద్ద బాబ్జి, నవీన్ ,హేమంత్, లక్ష్మి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగామెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించాలి- ఎం ఈ వో కే.నరేష్

**నక్కపల్లి, పెన్ సత్తా జూలై 21:**ఈనెల 24 న అన్ని ప్రభుత్వ ప్రాధమిక ఉన్నత పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని వేడుకగా నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి కె. నరేష్ అన్నారు. మంగళవారం మండలంలో అన్ని ప్రాధమిక,ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులతో వెబెక్స్ సమావేశం ద్వారా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థీ తమ తల్లిదండ్రులను తీసుకుని వచ్చి పేరెంట్స్ మీటింగ్ లో పాల్గొనేలా చూడాలన్నారు.ఈ సారి సమావేశానికి తల్లులతో పాటు తండ్రులుకూడా పాల్గొనేలా చూడాలని తమ పిల్లల విద్యా ప్రగతి పై చర్చించాలన్నారు.విద్యార్థుల ప్రగతిని తెలియజేసే హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులపై పేరెంట్స్ కు అవగాహన కల్పించాలన్నారు.సమావేశానికి హాజరయిన పేరెంట్స్ కు పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం అందించాలన్నారు.విద్యాశాఖ రూపొందించిన లెర్నింగ్ ఎక్స్ లెన్స్ ఆన్ ఆంధ్రప్రదేశ్ లీలీప్‌రి యాప్ ను తల్లిదండ్రులు కూడా విస్తృతంగా ఉపయోగించేలా చూడాలన్నారు. ప్రతీ తల్లిదండ్రులూ యాప్ ఖచ్చితంగా డౌన్ లోడ్ చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఎం ఈ వో 2 ఆర్.నాగన్నదొర మాట్లాడుతూ అన్నిపాఠశాలలనూ మామిడి తోరణాలు తో సర్వాంగ సుందరంగా అలంకరించాలని ,



పాఠశాల గ్రంధాలయంలో పుస్తకాలతో పాటు సైన్స్ ప్రయోగశాలలో పరికరాలను ప్రదర్శనగా ఉంచాలని సూచించారు.

# నక్కపల్లి నుండి చలో పంచదార్ల- భారీ ర్యాలీగా వెళ్లిన వైసీపీ శ్రేణులు

**నక్కపల్లి, పెన్ సత్తా, జులై 21:**పంచదార్ల పుణ్యక్షేత్రం ( పణిగిరి) పర్వతం అక్రమ గ్రావెల్ మైనింగ్ ని నిరసిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన చలో పంచదార్ల కార్యక్రమానికి నక్కపల్లి మండలం నుండి భారీ ఎత్తున వైసీపీ శ్రేణులు తరలి వెళ్లారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పుణ్యక్షేత్రమైన పంచదార్ల పర్వతాన్ని కూటమి ప్రభుత్వం అక్రమ మైనింగ్



చేపడుతుందన్నారు. దీనివల్ల ప్రకృతి సంపదలు నష్టం కలవడమే కాకుండా నదులు, వాగులు కలుషితం అయ్యి జలవనరులు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు.

అక్రమ గ్రావెల్ మైనింగ్ వల్ల పంచదార్ల నీరు కలుషితం అవుతుందని ఎట్టి పరిస్థితులను ఓటమి ప్రభుత్వ అక్రమ మైనింగ్ను అడ్డుకుని తీరుతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గొర్ల గోవిందరావు, వైస్ ఎంపీపీ వెలగ ఈశ్వరరావు, నాయకులు పొడకట్ల పాపారావు, కొప్పిశెట్టి హరిబాబు, తల్లా భార్గవ్, గంటా తిరుపతిరావు, అల్లాడ కొండబాబు తదితరులు ఉన్నారు.

# కరాటే క్రీడాకారులను, జాతీయస్థాయి క్రీడాకారులను అభినందించిన

### మంత్రి సత్య కుమార్ యాదవ్

**ధర్మవరం,జూలై 21 (పెన్ సత్తా)**ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్తి కుమార్ యాదవ్ జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన జూడో,ఖురాష్,కరాటే క్రీడలను ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా జివిఇ జెడ్పి గర్ల్స్ హై స్కూల్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన జాతీయ క్రీడాకారులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయి క్రీడాకారులు లో జూడో లో సింధు, ఖురాష్ లో అర్చన, కరాటే లో సాహిత్య, సీమ కౌసర్, అఖిలభాను, డామరేశ్వరి,జూడో విభాగంలో పథకాలు సాధించిన సుష్మిత, ప్రణీత,మౌన దుర్గ, అఖిల,రుక్సనా, హారికలను అభినందించారు. అదేవిధంగా కరాటే కోచ్ ఇనాయత్ భాషను పిడి స్వరూపాలు ప్రత్యేకంగా అభినందించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన కరాటే క్రీడాకారులను కూడా మంత్రి సత్య కుమార్ యాదవ్ ఘనంగా సన్మానించారు. అదేవిధంగా కరాటే శిక్షకులు విద్యార్థులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. చిలిపి వెంకటేష్ కరాటే అకాడమీలో తమిళనాడు సో క్యూ కిషన్ సంస్థ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ధర్మవరం క్రీడాకారులు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం విశేషమని మంత్రి కొనియాడారు.ఈ విజయానికి మార్గదర్శకులైన కరాటే మాస్టర్లు సిడిపి వెంకటేష్,ధర్మవరం, జ్యోతి కొత్తచెరువు, రామచంద్ర హిందూపురం,వేణు పెనుగొండ,వన్నూరు స్వామి గుంతకల్ వారిని అభినందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం ఇచ్చేందుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని తెలిపారు. మంత్రి చేతుల మీదుగా తాము సన్మానం పొందడం తమకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని కరాటే మాస్టర్లు,విద్యార్థులు తెలిపారు.రాష్ట్ర, జాతీయ స్థాయిలో ధర్మారం క్రీడా విద్యార్థులు ఉండడం దేశానికి రాష్ట్రానికి గర్వకారణమని



తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులు తమ క్రీడలను కెరీర్గా ఎంచుకొని దేశానికి పథకాలు సాధించాలని వారు ఆశీస్సులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు, తల్లిదండ్రులు,కరాటే క్రీడాకారులు,ఎన్డీఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పంచదార్ల లో అక్రమ మైనింగ్ కి నిరసనగా కదం తొక్కిన వైసిపి శ్రేణులు.



### పంచదార్ల పుణ్యక్షేత్రం (ఫణిగిరి) పర్వతాన్ని పవిత్రతను కాపాడాలంటూ హోరెత్తిన నినాదాలు.

### నో మైనింగ్ జోన్ జీవో వచ్చేంతవరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరిక.

**రాంబిల్లి పెన్ సత్తా, జులై 21::** అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం, పంచదార్లలో ఉన్న ఉమా ధర్మ లింగేశ్వర స్వామి ఆనుకొని ఉన్న ఫణిగిరి కొండపై అక్రమ మైనింగ్ ను తక్షణమే ఆపాలని, ఆలయం పవిత్రతను కాపాడాలని డిమాండ్ చేస్తూ చలో పంచదార్లకు వైసిపి శ్రేణులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర, జిల్లాలకు చెందిన వైసిపి నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పవిత్రతను కాపాడాలంటూ వైసిపి శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కదం తొక్కారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, రీజనల్ కోఆర్డినేటర్లు కురసాల కన్నబాబు, బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్ నాథ్, బొడ్డేడ ప్రసాద్, కేకే రాజు, ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న వివిధ నియోజకవర్గం ఇంచార్జ్ లు పాల్గొన్నారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడారు. పంచదార్లలో జరుగుతున్న అక్రమ మైనింగ్కు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటం ధర్మపోరాటమని, శ్రీ ధర్మలింగేశ్వరస్వామి ఆలయ పవిత్రతను కాపాడేందుకే వైఎస్సార్సీపీ ఈ ఉద్యమాన్ని చేపట్టిందని ప్రతిపక్ష పేర్కొన్నారు. దేవాలయ సమీపంలో అక్రమ మైనింగ్ జరుగుతున్న విషయాన్ని రాష్ట్ర ప్రజలతో పాటు దేశ ప్రజలందరికీ తెలియజేయాలనే ఉద్దేశంతోనే పంచదార్లకు వచ్చినట్లు తెలిపారు. వేల కోట్ల ఆస్తులు కలిగిన నాయకులే పవిత్ర దేవాలయ పరిసరాలను అపవిత్రం చేసేలా మైనింగ్ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. సనాతన ధర్మం గురించి మాట్లాడే నాయకులు ఈ ఘటనపై సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.కుట్ర జరిగిందని అధికార పక్ష నాయకులే చెబుతున్నప్పుడు వారి చేతిలోనే యంత్రాంగం ఉండగా నిజాలను ఎందుకు వెలికితీయలేకపోతున్నారని నిలదీశారు.

గతంలో పంచదార్లను 'నో మైనింగ్ జోన్'గా ప్రకటించాలని డీఆర్సీ సమావేశంలో తీర్మానం చేసినా ఇప్పటి వరకు అమలు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు.మైనింగ్ చేస్తున్న వారు 24 గంటల్లో అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరిస్తూ, కేసులకు భయపడేది లేదని, పోరాటాన్ని మరింతగా ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.అక్రమ మైనింగ్కు పాల్పడేది చిన్న వ్యక్తులు కాదని ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరు కలిపి దోచుకుంటున్నారని ఆరోపించారు.

అధికార పార్టీ నాయకులు కొంతమంది సనాతన ధర్మం అంటారు, ఎక్కడ ఉంది మీ సనాతన ధర్మం అని ప్రశ్నించారు. కళ్లు ఉంటే కూటమి పెద్దలు వచ్చి అక్రమ మైనింగ్ చూడమని కోరారు. పంచదార్ల కొండ కోసం తాము పోరాటం చేస్తుంటే కుట్ర దాగి ఉందని మాట్లాడతారా?.

ఏమి కుట్ర దాగి ఉందో కూటమి నేతలు చెప్పాలని నిలదీశారు.శివుడు మూడో కన్ను తెరిస్తే ఏమవుతుందో తెలుసుకోవాలన్నారు. మైనింగ్ వాహనాలు పంచదార్ల కొండపై ఉండకూడదన్నారు. ఉంటే నడిరోడ్డుపై ధర్నా చేస్తాం హెచ్చరించారు.అభివృద్ధి పేరుతో అక్రమ మైనింగ్ కు ఎవరు అనుమతి ఇచ్చారో తెలపాలని మాజీ మంత్రి కురసాల కన్నబాబు డిమాండ్ చేశారు.ఐదు ఎకరాలకు అనుమతి తీసుకొని 50 ఎకరాల్లో మైనింగ్ నిర్వహించారని ఆరోపించారు. 120 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరిపి ఆలయ పవిత్రతకు భంగం కలిగించారని విమర్శించారు.అక్రమాలకు పాల్పడిన వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో అక్రమ మైనింగ్కు ఎవరు అనుమతి ఇచ్చారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. స్థానిక ప్రజాప్రతినిధులు అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు.'నో మైనింగ్ జోన్' ప్రకటన జీవో రూపంలో వెలువడే వరకు వైఎస్సార్సీపీ పోరాటం ఆగదని హెచ్చరించారు.

అక్రమ మైనింగ్ ద్వారా ప్రాంత సంపదను దోచుకుంటున్నారని ఆరోపిస్తూ, ధర్మలింగే శ్వరస్వామి ఆలయ పరిరక్షణ కోసం చేపట్టిన ధర్మపోరాటాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సత్యవతి, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడు ప్రసాద్, వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, జిల్లా పరిషత్ చైర్పర్సన్ సుభద్రతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# అణచివేతే మార్గమా!?

ప్రజాస్వామ్య నిర్మాణానికి పునాది భిన్నాభిప్రాయాలను సహించే సహనం, చట్టబద్ధ పాలనపై అచంచల విశ్వాసం. ఈ రెండు మూలస్తంభాలు కదిలితే ప్రజాస్వామ్య వస్త్రం ఊడిపోతుంది. తమిళనాడులో తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధికారంలోకి వచ్చిన తొలి రెండు నెలల్లోనే, ముఖ్యమంత్రిని లేదా ఆయన మంత్రివర్గ సహచరులను విమర్శించినందుకు కనీసం పదిమంది పోలీసు చర్యను ఎదుర్కొన్నారు. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌ను విమర్శించినందుకు మాజీ మంత్రి అనితా రాధాకృష్ణన్ అరెస్టు అయిన ఉదంతం వెలుగులోకి వచ్చినా, ఇదే కాలంలో మరెందరో అరెస్టులకు, పోలీసు విచారణలకు గురయ్యారు. తిరునెల్వేలికి చెందిన జేమ్స్ రాజా, ముఖ్యమంత్రిని విమర్శిస్తూ ఫేస్‌బుక్ పోస్ట్ పెట్టినందుకు కోయంబత్తూరు నివాసులు వి విష్ణుప్రభు, టి మనోజ్‌కుమార్, కరూర్‌కు చెందిన తంగమణి వీరిలో ఉన్నారు. డీఎంకే జెన్-జెడ్ విభాగం నేత ఎ అంబినంతం విషయంలో, ముఖ్యమంత్రి, ఆయన కుటుంబంపై 'అనుచిత' పోస్టులు పెట్టారన్న ఆరోపణతో పోలీసులు అతని నివాసంలో సోదాలు చేశారు. యూట్యూబర్ మారిదాస్‌ను ముఖ్యమంత్రి, పరిశ్రమల మంత్రి ఎస్ కీర్తనపై చేసిన వ్యాఖ్యల కారణంగా చెన్నై సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. తూత్తుకుడిలో ముఖ్యమంత్రిపై బెదిరింపు వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణతో డీఎంకే ఎమ్మెల్యే మార్కండేయన్‌ను అరెస్టు చేశారు. హెచ్‌ఆర్ అండ్ సీఈ మంత్రి ఎస్ రమేశ్‌పై వ్యాఖ్యానించిన వినోత్ సూర్యకుమార్, టీవీకేను సమర్థించిన ఒక మహిళపై ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టిన అర్షే సరన్ జయరామన్ కూడా అరెస్టయిన వారి జాబితాలో ఉన్నారు. ఎస్ రమేశ్‌పై వ్యాఖ్యలు చేసినందుకు ఇంద్రాణి సుదలైముత్తుపై కూడా కేసు నమోదైంది. మరో రెండు తాజా ఉదంతాలు ఈ ధోరణికి మరింత బలం చేకూరుస్తున్నాయి. తూత్తుకుడి జిల్లా విళత్తికుళం డీఎంకే ఎమ్మెల్యే జీవీ మార్కండేయన్‌ను- కోవిల్‌పట్టిలో పార్టీ బహిరంగ సభలో ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలు బెదిరింపు ధోరణిలో ఉన్నాయంటూ పోలీసులు అరెస్టు చేశారు. ఇది జరిగి వారం తిరగకముందే- రాజకీయ కొనుగోళ్ల ఆరోపణలున్న ఓ కేసులో భాగంగా సీనియర్ జర్నలిస్ట్, పుదియ తలైముఱై ఎడిటర్ విజయన్‌ను ప్రశ్నించి, ఆయన మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకోవడం పెద్ద దుమారం రేపింది. దీన్ని జర్నలిస్టులను భయపెట్టే యత్నంగా అభివర్ణిస్తూ చెన్నై ప్రెస్ క్లబ్, మద్రాస్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ తీవ్రంగా ఖండించాయి. టీవీకేకు మిత్రపక్షమైన ద్రవిడర్ కజగం నేత కె వీరమణి సైతం మీడియాను బెదిరించడం ప్రజాస్వామ్య పాలనకు తగదని వ్యాఖ్యానించడం విశేషం. మరో వైచిత్రి ఏమిటంటే- గతంలో అన్నాడీఎంకే హయాంలో పాత్రికేయులపై నమోదైన తొంభైకిపైగా కేసులను వెనక్కి తీసుకుంటూ మీడియా స్వేచ్ఛకు కట్టుబడి ఉంటామని ప్రకటించిన డీఎంకేనే.. నేడు కొత్త సర్కారు చర్యలకు ప్రధాన లక్ష్యంగా మారడం! కేవలం రెండు నెలల పాలనలోనే పదిమందికిపైగా పౌరులు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు ఇలాంటి పోలీసు చర్యలను ఎదుర్కోవడం చూస్తుంటే.. అధికార పీఠం మారినా విమర్శలను సహించలేని రాజకీయ సంస్కృతి మారకపోవడమే విషాదం. మిత్రపక్షాల నుంచే విమర్శలు వ్యక్తమవుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతుండటం, పాలన తొలిదశలోనే ప్రతిష్టను దెబ్బతీసే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ జాబితా చూస్తే, అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం మొదటినుంచే విమర్శలను ఎంత అసహనంతో చూస్తోందో అర్థమవుతుంది!

అధికారంలోకి వచ్చిన ప్రతి రాజకీయ పక్షం తమ ప్రతిష్టను కాపాడుకునేందుకు పోలీసు యంత్రాంగాన్ని, నేర చట్టాలను కవచంగా వాడుకోవడాన్ని ఒక సాధారణ పద్ధతిగా మార్చేసుకుంది. ఇది ప్రజాస్వామ్యానికి ఒక నిర్మాణాత్మక ముప్పును సృష్టిస్తుంది. పోలీసుల చర్యలు గమనిస్తే, టీవీకే ప్రభుత్వ హయాంలో ప్రసంగ స్వేచ్ఛకు సంబంధించిన అరెస్టుల తీరు, అధికార నియంతృత్వ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వంలో ఉన్నవారిపై లేదా అధికార పార్టీపై వచ్చే ఎలాంటి విమర్శనైనా అణచివేసేందుకు పరువు నష్టం చట్టం, ఐటీ చట్టం, సైబర్ నేరాల నిబంధనలను ఇష్టానుసారం ఉపయోగిస్తున్నారు. టీవీకే కార్యకర్తలు దాఖలు చేసే ఫిర్యాదులు, పోలీసులు స్వయంగా (సుమోటో) తీసుకుంటున్న చర్యలు అసమ్మతివాదులను లక్ష్యంగా చేసుకోవడం పరిపాలననే గాడి తప్పించే ప్రమాదం ఉంది. మంత్రులపై వచ్చే ఆరోపణలను సహజ న్యాయ ప్రక్రియ ప్రకారం సివిల్ దావాలుగా లేదా రాజకీయ చర్చగా కొనసాగనివ్వకుండా, వెంటనే క్రిమినల్ తప్పుడు సమాచారంగా లేదా పరువు నష్టంగా పరిగణించేందుకు ప్రభుత్వం చూపిస్తున్న ఆత్రుత నిరాశ కలిగిస్తోంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాధినేతలపై విమర్శలు, వ్యంగ్యం, అసమ్మతి ఒక సహజ లక్షణం. వాటిని అణచివేయడం ద్వారా తాత్కాలికంగా ప్రతిష్టను కాపాడుకోవచ్చేమో కానీ, దీర్ఘకాలంలో ప్రజల విశ్వాసాన్ని కోల్పోతారు. అధికారంలో ఉన్నవారు తమపై వచ్చే విమర్శలను వ్యక్తిగత దాడులుగా భావించి, రాజ్యాంగం ఇచ్చిన అధికారాన్ని వ్యక్తిగత ప్రతీకారానికి వాడుకోవడం ప్రమాదకర పోకడ.

కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి ప్రజలతో తన సంబంధాలను, నిబంధనలను కొత్తగా రాసుకునే గొప్ప అవకాశం లభిస్తుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అసమ్మతిని సహించే సంస్కృతిని పెంపొందించాలి తప్ప, లభించిన అధికారాన్ని అణచివేతలకు దుర్వినియోగం చేయకూడదు. అభివృద్ధి పట్ల నిబద్ధత ఉన్న ఏ ప్రభుత్వమైనా బహిరంగ వేదికలపై వ్యక్తమయ్యే విమర్శలు, అసమ్మతి ద్వారా మరింత సుసంపన్నం కాగలదు, అందుకు ఆ ప్రభుత్వం సిద్ధంగా ఉంటే. హానికరమైన, అశ్లీల, అసభ్యకరమైన కంటెంట్‌ను నియంత్రించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, దానిని వాక్ స్వాతంత్ర్యం అనే అత్యున్నత విలువతో సమతూకం చేయాలని ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. రాజకీయ నాయకులపై వచ్చే వ్యంగ్యం, విమర్శ, ఆగ్రహం ప్రజాస్వామ్యంలో అనివార్యమైన భాగం. వాటిని ఎదుర్కొనేందుకు పోలీసు కేసులు, అరెస్టులు మార్గం కాదు, రాజకీయ జవాబుదారీతనం, పారదర్శకమైన సంభాషణ మాత్రమే సరైన మార్గం. టీవీకే ప్రభుత్వం ఈ పాఠాన్ని నేర్చుకోకపోతే, అధికార దుర్వినియోగమనే ముద్ర వెంటాడే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే, అధికారంలో ఉన్నవారు విమర్శను శత్రుత్వంగా కాక, జవాబుదారీతనానికి అవకాశంగా చూడాలి!!

## పనికొచ్చే పలుకు



# వినదగు.. కనగదు..!

"వినదగు నెవ్వరు చెప్పిన.. వినినంతనె వేగపడక వివరింపదగున్.. కనికల్ల నిజము దెలిసిన.. మనుజుడెపో నీతిపరుదు మహిలో సుమతీ!" -సుమారు ఏడు శతాబ్దాల క్రితం సుమతీ శతకకారుడు బద్దెన ఇచ్చిన పద్యమిది. నేటి డిజిటల్ యుగానికి చేసిన హెచ్చరికలా అనిపించడం విశేషం. ఎవరేం చెప్పినా ఓపికగా వినాలి. కానీ తొందరపడి నిర్ణయానికి రాకూడదు. ఆ మాటలను క్షుణ్ణంగా పరిశీలించి, అందులో ఏది అబద్ధమో ఏది నిజమో గ్రహించగలిగినవాడే నిజమైన నీతిపరుడు. ఇదీ పద్య సారాంశం. కేవలం నాలుగు పంక్తుల్లో శతకకారుడు.. వినే సంస్కారాన్నీ, ఆలోచించే వివేకాన్నీ, నిగ్గు తేల్చే విచక్షణనూ ఒకేసారి బోధించాడు. ఈ పద్యాన్ని లోతుగా గమనిస్తే మూడు మెట్లు కనిపిస్తాయి. మొదటిది -'వినదగు నెవ్వరు చెప్పిన'. అంటే చెప్పేవారి హోదా, వయసు, అంతస్తు చూడకుండా అందరి మాటలూ వినాలి. చిన్నవాడి నోటి నుంచైనా మంచి మాట రావచ్చు. వినడానికే సిద్ధపడనివాడు నేర్చుకోవడం ఎలా మొదలుపెడతాడు? రెండోది -'వినినంతనె వేగపడక'. ఇదే అసలు కీలకం. విన్న ప్రతిదాన్నీ వెంటనే నమ్మేయడం, ఆవేశంతో స్పందించడం అవివేకం. మూడోది -'గనికల్ల నిజము దెలిసిన'. స్వయంగా పరిశీలించి సత్యాసత్యాలను నిర్ధారించుకోవడం. వినికిడి జ్ఞానంతో ఆగిపోకుండా.. దాన్ని విచారణ అనే జల్లెడలో వేసి వడపోయడమే పరిణతి.

ఈ మూడు మెట్ల సూత్రం నేటి మన జీవనశైలిని ఎలా మార్చగలదో చూద్దాం. మనం జీవిస్తోంది సమాచార ప్రవాహ యుగంలో. ఫోన్ తెరిస్తే చాలు.. వాట్సాప్ ఫార్వర్డ్‌లు, సోషల్ మీడియా పోస్టులు, యూట్యూబ్ వీడియోలు క్షణానికొకటి దాడి చేస్తుంటాయి. వీటిలో నిజాలెన్నో, అబద్ధాలెన్నో! ఒక వదంతు నిజం కాకముందే ప్రపంచాన్ని చుట్టేస్తుంది. విన్నది విన్నట్టు నమ్మి ఫార్వర్డ్ చేసే అలవాటు.. వ్యక్తుల పరువు తీయడమే కాదు, సమాజంలో విద్వేషాలను, భయాలను రగిలిస్తుంది. ఆరోగ్యం గురించో, పెట్టుబడుల గురించో వచ్చే తప్పుడు సలహాలను గుడ్డిగా అనుసరించి జీవితాలను నాశనం చేసుకున్నవారు ఎందరో. 'ఫలానా స్కీమ్‌లో డబ్బులు రెట్టింపు' అన్న మాట విని మోసపోయేవారు, నకిలీ వైద్య చిట్కాలు పాటించి ప్రాణాల మీదకు తెచ్చుకునేవారు -వీరంతా శతకకారుడు చెప్పిన 'వేగపడక' అనే ఒక్క మాటను విస్మరించినవారే. అలాగని అన్నింటినీ అనుమానించడమూ సరికాదు. వినడమే మానేస్తే కొత్త జ్ఞానం అందదు; ప్రతిదీ నమ్మేస్తే మోసాలకు బలవుతాం. ఈ రెంటి మధ్య సమతుల్యతే వివేకం.

ఈ పద్యాన్ని నిత్య జీవితంలో ఆచరించడం పెద్ద కష్టమేమీ కాదు. ఏదైనా సంచలన వార్త కంటబడగానే స్పందించే ముందు ఒక్క నిమిషం ఆగడం అలవాటు చేసుకోవాలి. 'ఈ సమాచారం ఎక్కడి నుంచి వచ్చింది? చెబుతున్నవారికి ఇందులో స్వార్థమేమైనా ఉందా? దీన్ని నిర్ధారించే ఆధారాలున్నాయా?' అని ప్రశ్నించుకోవాలి. కుటుంబంలో, కార్యాలయంలో ఎవరి గురించైనా ఫిర్యాదు వినగానే తీర్పు ఇవ్వకుండా.. రెండోవైపు కథనూ వినే సహనం పెంచుకోవాలి. పిల్లలకు కూడా చిన్నప్పటినుంచే 'ప్రశ్నించి తెలుసుకో' అనే తత్వాన్ని నేర్పాలి. ఇలా విన్నదాన్ని తూచే అలవాటు స్థిరపడితే.. తొందరపాటు నిర్ణయాలు తగ్గుతాయి, మోసపోయే అవకాశాలు సన్నగిల్లుతాయి, బంధాల్లో అపార్థాలు తొలగుతాయి. నిజానికి ప్రపంచం నేడు 'క్రిటికల్ థింకింగ్' అని గొప్పగా చెప్పుకుంటున్న నైపుణ్యాన్ని.. సుమతీ శతకకారుడు ఏడు వందల ఏళ్ల క్రితమే అచ్చ తెలుగులో, కంద పద్యంలో అందించాడు. చెవులు తెరిచి ఉంచు.. కానీ మెదడును మూసేయకు. ఇదే సుమతీ శతకం మనకిచ్చిన కాలాతీత సందేశం. విని, గని, తెలుసుకుని నడిచేవాడే నేటికీ, ఏనాటికీ నిజమైన నీతిపరుడు.


# బొద్దింకల సింహగర్జన!



యువత సహనానికి హద్దులుంటాయి. ఉపాధి లేక, భవిష్యత్తుపై నమ్మకం సన్నగిల్లుతున్న తరుణంలో, తమ కలలకు మూలమైన పోటీ పరీక్షలే పదే పదే లీకేజీలు, గందరగోళాలతో భ్రష్టుపడుతుంటే, ఆ ఆగ్రహం ఎప్పుడో ఒకసారి వీధుల్లోకి రాక తప్పదు. దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం చోటుచేసుకున్న పరిణామాలు సరిగ్గా ఇదే వాస్తవాన్ని రుజువు చేశాయి. దేశ ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నిరుద్యోగ యువతను 'బొద్దింకలు', 'పరాన్నజీవులు'గా అభివర్ణించారన్న వార్తలపై మే నెలలో సోషల్ మీడియాలో ఒక వ్యంగ్య ఉద్యమంగా మొదలైన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ), క్రమంగా వాస్తవ ప్రపంచంలో నిరసన శక్తిగా రూపాంతరం చెందింది. తమను కించపరిచేలా మాట్లాడిన మాటనే తమ ఉద్యమానికి పేరుగా మార్చుకుని, 'బొద్దింకల్లా మేం మళ్లీ మళ్లీ వస్తాం, ఎన్నిసార్లు తొక్కేసినా బతికే ఉంటాం' అనే స్ఫూర్తితో యువత ముందుకు రావడం విశేషం. జంతర్ మంతర్ వద్ద నెలల తరబడి సాగుతున్న ఆందోళన, సోమవారం పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజు 'చలో సంసద్' పిలుపుతో పతాకస్థాయికి చేరింది. వేలాది విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు పార్లమెంటువైపు కదలగా, పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించి, లాఠీఛార్జి చేసి వారిని చెల్లాచెదురు చేశారు. పటేల్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్ సహా పలు ప్రాంతాల్లో ఉద్రిక్త దృశ్యాలు కనిపించాయి. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వందలాది మంది గాయపడ్డారు. ఈ ఉద్యమానికి నైతిక బలం చేకూరుస్తూ, లద్దాఖ్ ఉద్యమకారుడు, రామన్ మెగసెసె అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్చుక్ జూన్ 28నుంచి నిరాహార దీక్షలో ఉన్నారు. లద్దాఖ్ రాష్ట్ర హోదా, పర్యావరణ పరిరక్షణ ఉద్యమాల్లో గతంలోనూ దీక్షలు చేపట్టిన చరిత్ర ఉన్న వాంగ్చుక్, ఈసారి యువత పక్షాన నిలబడటం ఈ ఉద్యమానికి మరింత విశ్వసనీయతను చేకూర్చింది. ఆయన ప్రస్తుతం సఫ్దర్జంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా, తన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, సోమవారం ర్యాలీలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలంటూ స్వయంగా చేతిరాతతో లేఖ రాయడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. పాఠశాలలకు వెళ్తున్నామని ఇంట్లో చెప్పి నిరసనకు వచ్చిన బాలికలు, రాత్రంతా బస్సుల్లో ప్రయాణించి ఢిల్లీ చేరుకున్న యువతులు, వాట్సాప్ గ్రూపుల ద్వారా సమన్వయం చేసుకుని బిహార్, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్‌ల నుంచి తరలివచ్చిన సాధారణ కుటుంబాల పిల్లలు -వీరంతా ఉద్యమానికి నిజమైన ముఖచిత్రం. ఇదేదో రాజకీయ పార్టీ ప్రేరేపిత ఆందోళన కాదని, తమ భవిష్యత్తు కోసం సొంతంగా వీధుల్లోకి వచ్చిన జెన్-జీ ఆవేదనని దృశ్యాలు స్పష్టం చేస్తున్నాయి. దేశ రాజధానిలో నిరసనలకు ఏకైక అనుమతి ప్రదేశంగా ఉన్న జంతర్ మంతర్‌కే పరిమితం చేసి, మరెక్కడా అనుమతి నిరాకరించిన తీరు కూడా ఉద్యమకారుల్లో అసంతృప్తిని రేకెత్తించింది. ఏటా 24 లక్షలకుపైగా విద్యార్థులు పోటీపడే నీట్‌వంటి పరీక్ష, లక్షలాది కుటుంబాల కలలు, వారి పిల్లల భవిష్యత్తు ముడిపడి ఉన్న అంశం. అలాంటి కీలకమైన పరీక్షే పదే పదే విశ్వసనీయతను కోల్పోతే, యువతలో వ్యవస్థపై అపనమ్మకం పెరగడం సహజం. బాలీవుడ్ నటులు, ప్రముఖులు సైతం వాంగ్చుక్ దీక్షకు మద్దతు ప్రకటిస్తూ, ఆయనను దీక్ష విరమించాలని కోరుతున్న తీరు, ఈ అంశం సమాజంలోని అన్ని వర్గాలనూ కదిలించిందనేందుకు నిదర్శనం. విద్యార్థి లోకం ఇంతగా ఏకతాటిపైకి రావడం గత కొన్నేళ్లలో అరుదుగా కనిపించిన దృశ్యం.

ఈ ఆగ్రహానికి కారణాలు పరిశీలిస్తే, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో పరీక్షల నిర్వహణ పదే పదే విఫలమైన తీరు స్పష్టం. 2026 నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఒక్కటే కాదు, సీబీఎస్ఈ 12వ తరగతి ఆన్లైన్ మార్కింగ్ విధానంలో గందరగోళం, సీయూఈటీ పరీక్షలో సాంకేతిక లోపాలు వంటి పరిణామాలు వరుసగా చోటుచేసుకున్నాయి. లక్షలాది విద్యార్థులు, వారి కుటుంబాలు ఏళ్ల తరబడి రేయింబవళ్లు కష్టపడి సిద్ధమైన పరీక్షలు ఇలా భ్రష్టుపట్టడం, జాతీయ పరీక్షా సంస్థపై, విద్యాశాఖపై యువతలో విశ్వాసం సన్నగిల్లడానికి కారణమైంది. నీట్ పేపర్ లీకేజీ కారణంగా 21 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని సీజేపీ పేర్కొంటూ, వారి కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. ఇంతటి తీవ్రమైన మానవ నష్టం జరిగినా, బాధ్యత వహించాల్సిన మంత్రి పదవిలో కొనసాగుతుండటం, కేంద్ర ప్రభుత్వం సుదీర్ఘకాలం మౌనం వహించడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. సీజేపీ ప్రతినిధులు కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో గంటల తరబడి చర్చలు జరిపి, మంత్రి రాజీనామా, వాంగ్చుక్ విడుదల, పరిహారం అనే మూడు డిమాండ్లతో కూడిన లేఖను అందజేసినా, ప్రభుత్వం నుంచి ఎలాంటి కచ్చితమైన హామీ లభించలేదు. మరోవైపు, శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వచ్చిన విద్యార్థులపై, చిన్నారులపై, మహిళలపై బాష్పవాయువు, లాఠీలు ప్రయోగించడం ప్రభుత్వ ప్రాధాన్యతలు ఎటువైపు ఉన్నాయో తేటతెల్లం చేస్తుంది. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాంగ్చుక్‌ను నిరసన స్థలం నుంచి బలవంతంగా తరలించడం, జంతర్ మంతర్ వద్ద నిరసన వేదికను ధ్వంసం చేయడంవంటి చర్యలు, అసమ్మతిని సహించే ఓపిక ప్రభుత్వానికి కొరవడిందనే భావనను మరింత బలపరుస్తున్నాయి. తమ డిమాండ్లు 'న్యాయబద్ధమైనవి, దేశ యువత ఆకాంక్షలకు అనుగుణమైనవి' అని సీజేపీ ప్రతినిధులు స్పష్టం చేసినా, ప్రభుత్వం వాటిని పరిష్కరించే బదులు బలప్రయోగంవైపే మొగ్గు చూపడం గమనార్హం. దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో సంఘీభావ ప్రదర్శనలు జరగడం, ప్రతిపక్ష పార్టీలు కేంద్రంపై విమర్శల వర్షం కురిపించడం చూస్తుంటే, ఇది ఒక్క ఢిల్లీకో, ఒక్క పరీక్షకో పరిమితమైన సమస్య కాదని, యువత మొత్తం విద్యా వ్యవస్థపై పెంచుకున్న అసంతృప్తికి ప్రతీక అని అర్థమవుతుంది.

కేంద్ర ప్రభుత్వం తక్షణం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. జాతీయ పరీక్షా సంస్థ పనితీరుపై సమగ్ర సమీక్ష చేపట్టడం, పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరీక్షా విధానాన్ని రూపొందించడం, పేపర్ లీకేజీలకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం కావాలి. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సూచించినట్లు, లాఠీఛార్జికి బదులు యువతతో నేరుగా చర్చలు జరపడమే సరైన మార్గం. ఒక ప్రజాస్వామ్య దేశంలో, రేపటి పౌరులుగా మారబోయే విద్యార్థులు తమ ఆందోళనను శాంతియుతంగా వ్యక్తం చేసే హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. వాంగ్చుక్‌వంటి ఉద్యమకారుల ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకుని, ఆయనపై ఆంక్షలు సడలించడం మానవీయ కోణంలో అత్యవసరం. కోటి రూపాయల పరిహారం డిమాండ్‌ను తేలిగ్గా తీసుకోకుండా, ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాల వేదనను అర్థం చేసుకుని, తగిన సహాయక చర్యలు చేపట్టాలి. కేవలం ఒక మంత్రి రాజీనామాతో సమస్య పూర్తిగా పరిష్కారం కాకపోవచ్చుగానీ, బాధ్యతాయుతమైన పాలన అంటే ఏమిటో చాటిచెప్పే మొదటి అడుగు కాకపోదు. జెన్-జీ గొంతును అణచివేయాలని చూడటం తాత్కాలిక ఉపశమనం ఇవ్వొచ్చేమో గానీ, దీర్ఘకాలంలో యువతలో ప్రభుత్వంపై అపనమ్మకాన్నే పెంచుతుంది. ■




మానసిక ఒత్తిడి -లోపలి నుంచే మొదలవుతుంది. సవాళ్లను ఎలా స్వీకరించాలో, ఆలోచనలను ఎలా అదుపులో ఉంచుకోవాలో తెలియనప్పుడే మనసు కుంగిపోయి, ఒత్తిడికి లోనవుతుంది. పరిస్థితులు మన చేతుల్లో ఉండకపోవచ్చు, కానీ వాటికి మనం స్పందించే తీరు మాత్రం పూర్తిగా మన చేతుల్లోనే ఉంటుంది. అందుకే బయటి ప్రపంచాన్ని మార్చాలని ప్రయత్నించే ముందు, మన అంతరంగాన్ని అర్థం చేసుకుని, సరిదిద్దుకోవడం నేర్చుకోవాలి. మనసును బలంగా తీర్చిదిద్దుకున్నవారికి ఎలాంటి కష్టమైన పరిస్థితి అయినా ఒక సవాలుగానే కనిపిస్తుంది తప్ప, భారంగా అనిపించదు. కాబట్టి జీవితాన్ని మార్చుకోవాలనుకునే ముందు, మిమ్మల్ని మీరు మార్చుకోవడం నేర్చుకోండి.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# కిరాయికి కుక్కలు!



కుక్కను పెంచుకోవాలని ఉన్నా, ఆ బాధ్యతలు మోయలేమని అనుకునేవారికి చైనాలో వినూత్న ఆలోచన హల్‌చల్ చేస్తోంది. 'వాంగ్‌పు' అనే పెట్-షేరింగ్ యాప్, గత మార్చిలో సోషల్ మీడియా వేదికగా కుక్కలను గంటల లెక్కన అద్దెకిచ్చే వినూత్న సర్వీస్ ప్రారంభించింది. బీజింగ్, షాంఘై, షెన్‌జెన్‌వంటి నగరాల్లో ఇది ఇప్పటికే జోరుగా నడుస్తోంది. యజమానులు తమ కుక్క వివరాలు, ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తే, ఆసక్తి ఉన్నవారు నచ్చిన కుక్కను ఎంపిక చేసుకుని ఒకటి రెండు గంటలపాటు షికారుకు తీసుకెళ్లొచ్చు. దీనికి గంటకు సుమారు రూ.130 నుంచి రూ.780 వరకు చార్జ్ చేస్తారు. కుక్కను తీసుకెళ్లేందుకు, తిరిగి అప్పగించేందుకు యజమాని-అద్దెదారు మధ్యే ఒప్పందం కుదురుతుంది. కుక్కకు తెలిసిన ప్రాంతాల్లోనే షికారుకు అనుమతిస్తారు. ఇరు పక్షాలూ నిజ గుర్తింపు వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉండగా, కుక్కకు ఇన్సూరెన్స్ కూడా కంపెనీయే భరిస్తుంది. అయితే మారుతున్న యజమానులు, కొత్త వాతావరణాలతో కుక్కలు మానసిక ఒత్తిడికి గురవుతాయని కొందరంటుంటే, ఇది దత్తత అవకాశాలను పెంచుతుందని ఇంకొందరు సమర్థిస్తున్నారు.

స్పోర్ట్స్

# గ్లాస్గో పిలుస్తోంది!


## రేపటి నుంచి కామన్వెల్త్ గేమ్స్

**గ్లాస్గో (స్కాట్లాండ్):** ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీకి తెరపడి మూడు రోజులు గడిచాయో లేదో క్రీడాభిమానులను అలరించేందుకు మరో మెగా క్రీడా ఈవెంట్ సిద్ధమైంది. బ్రిటిష్ పాలిత దేశాల మధ్య నాలుగేళ్లకోసారి జరిగే కామన్వెల్త్ గేమ్స్ బుధవారం ప్రారంభమవుతాయి. స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరం వేదికగా ఆగస్టు 2వ తేదీ వరకు కామన్వెల్త్ గేమ్స్ జరుగుతాయి. ఈ క్రీడలకు మస్కట్‌గా యునికార్న్ (ఒంటికొమ్ము గుర్రం)ను ఎంపిక చేశారు. దీనికి 'ఫినీ' అని పేరు పెట్టారు. 74 దేశాల నుంచి 3000 మందికిపైగా క్రీడాకారులు పాల్గొంటారు. భారత్, ఆస్ట్రేలియా, కెనడా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా తదితర దేశాల నుంచి ఒలింపిక్, ప్రపంచ చాంపియన్‌షిప్ పతక విజేతలు ఈ క్రీడల్లో బరిలోకి దిగనున్నారు. వాస్తవానికి 2026 కామన్వెల్త్ గేమ్స్ ఆతిథ్యహక్కులు ఆస్ట్రేలియాలోని విక్టోరియా నగరానికి కేటాయించారు. అయితే 2023లో ఈ క్రీడలు నిర్వహించలేమంటూ ఆస్ట్రేలియా ప్రకటించింది. దాంతో ఈ క్రీడల నిర్వహణకు మరోసారి గ్లాస్గో ముందుకొచ్చింది. 2014 కామన్వెల్త్ గేమ్స్ కూడా గ్లాస్గోలోనే జరిగాయి. ఓవరాల్‌గా స్కాట్లాండ్‌లో కామన్వెల్త్ క్రీడలు స్కాట్లాండ్‌లో జరగనుండటం ఇది నాలుగోసారి. అంతకుముందు 1970, 1986లో స్కాట్లాండ్ రాజధాని ఎడిన్‌బర్గ్ కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యమిచ్చింది. 2022 బర్మింగ్‌హామ్‌లో 20 క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. ఈసారి 10 క్రీడాంశాల్లోనే (3x3 బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, జూడో, నెట్‌బాల్, స్విమ్మింగ్, ట్రాక్ సైక్లింగ్, లాన్ బౌల్స్) నిర్వహించనున్నారు. భారత్ నుంచి 125 మంది క్రీడాకారులు 10 క్రీడాంశాల్లో పోటీపడనున్నారు. 2030 కామన్వెల్త్ గేమ్స్ భారత్‌లోని అహ్మదాబాద్ నగరంలో జరగనున్నాయి.



# తొలి రౌండ్‌లోనే ప్రణయ్, దేవిక నిష్క్రమణ

**చాంగ్జౌ:** చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్--1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు తొలి రోజు నిరాశ ఎదురైంది. పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్... మహిళల సింగిల్స్‌లో దేవిక సిహాగ్ తొలి రౌండ్‌లోనే ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు. థాయ్‌లాండ్ ఓపెన్ చాంపియన్ దేవిక 19--21, 21--19, 13--21తో ప్రపంచ 20వ ర్యాంకర్ బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో పోరాడి ఓడిపోయింది. 2023 ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత ప్రణయ్ 10--21, 14--21తో లియోంగ్ జున్ హావో (మలేసియా) చేతిలో పరాజయం చవిచూశాడు. నేడు మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత స్టార్ పీవీ సింధు భారత్‌కే చెందిన ఉన్నతి హుడాతో ఆడుతుంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో యుషి తనాకా (జపాన్)తో లక్ష్య సేన్; అల్వీ ఫర్హాన్ (ఇండోనేసియా)తో ఆయుశ్ తలపడతారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ ఫెంగ్ యాన్ జె--హువాంగ్ డాంగ్ పింగ్ (చైనా)లతో గద్దె రుత్విక శివాని--రోహన్ ... గువో జిన్ వా--చెన్ ఫాంగ్ హుయ్ (చైనా)లతో తనీషా క్రాస్టో--ధ్రువ్ కపిల పోటీపడతారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో లియాంగ్ వె కెంగ్--వాంగ్ చాంగ్ (చైనా)లతో హరిహరన్--అర్జున్ ఆడతారు.



## పటిష్ట స్థితిలో యువ భారత్





**కొలంబో:** శ్రీలంక పర్యటనలో ఉన్న భారత అండర్-19 జట్టు.. ఆతిథ్య దేశంతో ఆడుతున్న సెకండ్ టెస్ట్‌లో రెండు రోజుల ఆట ముగిసే సమయానికి మ్యాచ్‌ను శాసించే స్థితిలో నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్‌కు మనాల్ చౌహాన్ (150), కుశాగ్ర ఓజా (111) శతకాలకు తోడు కెప్టెన్ యశ్వర్ధన్ (78) రాణించడంతో పర్యాటక జట్టు 411 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన శ్రీలంక అండర్-19 టీమ్.. భారత బౌలర్లు కట్టడిచేయడంతో రెండో రోజు ఆట చివరికి 40 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 122 రన్స్ చేసి కష్టాల్లో పడింది.

## నేను బాధ్యతాయుతంగా ఆడాలి: తిలక్ వర్మ

**హరారే:** తన బ్యాటింగ్ తీరుపై వస్తున్న విమర్శలపై భారత టీ20 వైస్ కెప్టెన్ తిలక్ వర్మ స్పందించాడు. 'ఈ ఆటలో మీరు పరిస్థితులకు తగ్గట్టు బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది. ఏ స్థానంలో బ్యాటింగ్‌కు పంపినా బాదుడే అంటే కుదరదు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో పవర్‌ప్లేలోనే ఐదు వికెట్లు కోల్పోవడంతో బ్యాటింగ్‌కు వెళ్లా. అప్పుడు హిట్టింగ్ చేస్తాననడం సరికాదు. ఫస్ట్ బాల్ నుంచే వేగంగా ఆడటం నాకూ తెలుసు. కానీ నేను నా దేశానికి ఆడుతున్నప్పుడు, వైస్‌కెప్టెన్‌గా మరింత బాధ్యతతో ఆడాల్సి ఉంటుంది' అని తిలక్ తెలిపాడు.






దక్షిణాది చిత్రసీమలో దూసుకుపోతున్న యషికా ఆనంద్, ఎరుపు రంగు గ్లామరస్ లుక్‌లో మెరిసిపోతోంది.

# బేబీ బంప్‌తో స్టన్నింగ్ లుక్... రెడ్ బీచ్ డ్రెస్‌లో ఆకట్టుకున్న 'సామజవరగమన' బ్యూటీ



తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సామజవరగమన' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మలయాళ ముద్దుగుమ్మ రెబా మోనికా జాన్. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, సహజమైన నవ్వుతో సౌత్ ఇండియాలో ప్రత్యేకమైన క్రేజ్ సంపాదించుకున్న ఈ నటి, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. థాయిలాండ్‌లోని ఫుకెట్ బీచ్ రిసార్ట్‌లో రెడ్ కలర్ ప్రింటెడ్ మ్యాక్సీ డ్రెస్ ధరించి, తన బేబీ బంప్‌ను చూపిస్తూ ఆమె దిగిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి.

**పెళ్లి తర్వాత కూడా కెరీర్‌లో దూకుడు:**

మోడలింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న రెబా మోనికా జాన్ ట్రెడిషనల్ శారీస్ అయినా, మోడ్రన్ వెస్ట్రన్ వేర్ అయినా చాలా స్టైలిష్‌గా క్యారీ చేస్తుంది. ఈమె 2022 జనవరిలో తన చిరకాల మిత్రుడు జోమోన్ జోసెఫ్‌ను వివాహం చేసుకున్నారు. ఇక ఇక పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో ఎంతో యాక్టివ్‌గా ఉంటున్న ఈ బ్యూటీ, తెలుగులో సామజవరగమన తో పాటు మృత్యుంజయ్, మ్యాడ్ స్క్వేర్ వంటి క్రేజీ చిత్రాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది.

**బీచ్ లో రెడ్ డ్రెస్ హంగామా - ప్రెగ్నెన్సీ గ్లో:**

ప్రస్తుతం ప్రెగ్నెంట్‌గా ఉన్న రెబా, ద నాకా ఫుకెట్ రిసార్ట్‌లో వెకేషన్‌ను ఫుల్‌గా ఎంజాయ్ చేస్తోంది. అక్కడ బీచ్ ఒడ్డున వైబ్రెంట్ రెడ్ ప్రింటెడ్ స్ట్రాపీ మ్యాక్సీ బీచ్ డ్రెస్ ధరించి సరికొత్తగా ఫోటోలకు పోజులిచ్చింది. హై లెగ్ స్లిట్ ఉన్న ఈ డ్రెస్‌లో ఆమె తన మెటర్నిటీ లుక్‌ను ఎంతో కాన్ఫిడెంట్‌గా ప్రదర్శించింది. ఇక ఇక ఆమె ముఖంలో కనిపిస్తున్న ప్రెగ్నెన్సీ గ్లో చూసి అభిమానులు మురిసిపోతున్నారు. "ప్రెగ్నెన్సీ గ్లో అనేది నిజంగానే అద్భుతం" అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

**సమయం ఎంత వేగంగా గడిచిపోయింది:**

తన బేబీ బంప్ ఫోటోలను షేర్ చేస్తూ రెబా మోనికా జాన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన క్యాప్షన్ కూడా అందరినీ ఆకట్టుకుంటోంది. "సమయం ఇంత వేగంగా ఎలా గడిచిపోయింది? బేబీ బంప్‌తో గడిపే చివరి కొన్ని రోజులు ఇవి" అంటూ ఆమె ఎమోషనల్ అయ్యింది. ఇక త్వరలోనే మాతృత్వపు తీపి అనుభూతిని పొందబోతున్న తరుణంలో ఆమె ముఖంలోని ఆనందం ఈ ఫోటోలలో స్పష్టంగా కనిపిస్తోంది. రెబా షేర్ చేసిన ఈ బ్యూటిఫుల్ ఫోటోలు చూసి ఫ్యాన్స్, సెలబ్రిటీలు ఆమెకు పెద్ద ఎత్తున కంగ్రాట్స్ చెప్తున్నారు. ఈ ప్రెగ్నెన్సీ సమయంలో జాగ్రత్తగా ఉండాలంటూ అభిమానులు కామెంట్ల సెక్షన్‌లో ప్రేమను కురిపిస్తున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో రాచరికపు అందాన్ని వలకబోసే ఈ సామజవరగమన బ్యూటీ, ఇప్పుడు ప్రెగ్నెన్సీ లుక్‌లోనూ అంతే స్టైలిష్‌గా మరియు క్యూట్‌గా కనిపిస్తూ అందరి హృదయాలను గెలుచుకుంటోంది.



యోధురాలి తరహా బంగారు వర్ణపు వేషధారణలో జియోర్జియా ఆండ్రియాని మెరుపులు

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com